వాల్మీకిపురంలో సీతారాముల కల్యాణం చేస్తున్న వేదపండితులు



వైభవంగా సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలో వెలసిన పట్టాభిరామాలయంలో బుధవారం పునర్వసు నక్షత్ర సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. సీతారాములను వేదికపై ఆశీనులను చేసి వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల ఘోష, విశేష భక్తజనం నడుమ సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. చివరగా హోమాది కార్యక్రమాలలో పూర్ణాహుతి చేసి వేడుకల్లో పాల్గొన్న దంపతులకు టీటీడీ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం సీతారామ లక్ష్మణులను తిరుచ్చిపై పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వ్యాధుల నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్లే కీలకం

● శిక్షణలో డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య


రాయచోటిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని ఎన్జీవో హోంలో జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్స్‌కు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో ల్యాబ్ టెక్నీషియన్స్ పాత్ర చాలా ముఖ్యమని, ప్రధానంగా మలేరియా, డెంగ్యూ, షుగర్, హెచ్‌బీ ఇతర రక్తపరీక్షల నిర్ధారణ పత్రాలను ప్రజలకు ఇస్తుండాలని, విధి నిర్వహణలో శ్రద్ధగా పనిచేయాలన్నారు. కడప మలేరియా అధికారి మనోరమ మాట్లాడుతూ రికార్డ్స్ అన్నీ సక్రమంగా మెయింటైన్ చేయాలని తెలిపారు. విజయవాడ నుంచి శిక్షణ ఇచ్చేందుకు వచ్చిన అధికారి లక్ష్మీసుభద్ర మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, ఇతర రక్త పరీక్షలు చేసి కరెక్ట్‌గా నిర్ధారణ చేయాలని తెలిపారు. పరీక్షలు చేసే విధానం, రికార్డ్స్, ల్యాబ్ నిర్వహణపై ల్యాబ్ టెక్నీషియన్స్‌కు ఉదయం నుంచి సాయంత్రం వరకు శిక్షణ ఇచ్చారు. జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ ట్రైనింగ్ వల్ల అందరూ ఎల్‌టీలకు మంచి అవగాహన వచ్చిందన్నారు. రేపటి నుంచి 3 బ్యాచ్‌లుగా అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రాక్టికల్ వర్క్ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులు వై.ప్రసాద్‌యాదవ్, జయరామయ్య, జయచంద్ర, ఖలీల్, ముజీబ్, దాస్, శ్రీను, కృష్ణమ్మ, ల్యాబ్ టెక్నీషియన్స్ పాల్గొన్నారు.



ల్యాబ్ టెక్నీషియన్ల శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య

ఎండిపోయిన రామసముద్రం మండలంలోని అగ్రహారం పెద్దచెరువు





మదనపల్లె మండలం కొత్తపల్లె వద్ద కంపచెట్లు, పిచ్చి మొక్కలతో ఓబులనాయునిచెరువు

నైరుతి నిరాశపరిస్తే.. ఈశాన్యం కరుణిస్తుందన్న రైతుల ఆశలు ఈ ఏడాది నెరవేరేలా కనిపించడం లేదు. ఆకాశంలో మబ్బులు, మేఘావృతం, తుంపర్లు మినహా పెద్దగా వర్షం పడిన దాఖలాలు లేవు. జూన్‌లో ఖరీఫ్ సీజన్ నిరాశ పరిచింది. నవంబరులో రబీ సీజన్ కూడా రైతుకు ఏమాత్రం లాభించేలా కనిపించడం లేదు. ఖరీఫ్ ప్రారంభమైన జూన్ తర్వాత, రబీ సీజన్ ప్రారంభంలో అప్పుడప్పుడూ అడపా దడపా పడిన వర్షానికి అక్కడక్కడా చెరువులు, కుంటల్లో ఓ మోస్తరుగా నీరు చేరినా పెద్దగా ఫలితం ఇవ్వడం లేదు. పశువులకు గ్రాసం, తాగునీటికే సరిపోయాయి. ప్రస్తుతం చివరి దశలో ఉన్న ఈశాన్య రుతుపవనాలు కూడా ముఖం చాటేసే పరిస్థితి కనిపిస్తోంది. సీజన్ ముగుస్తోంది..చలి మొదలైంది. మంచు ముంచుకొస్తోంది. ఇక వర్షాలు పడే అవకాశం తక్కువనే నిపుణుల మాటలతో రైతుల్లో ఆందోళన మొదలైంది.



నైరుతి నిరాశ.. ఈశాన్యం ఊరించె..

● చలి మొదలయ్యే... ● వరుణదేవుడు కరుణించేనా..?

● ఖాళీగా దర్శనమిస్తున్న నీటి వనరులు ● రబీ సాగేనా? నీటి ఇబ్బందులు తప్పేనా?

మదనపల్లె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట రెవెన్యూ డివిజన్లలో 3,276 చెరువులు ఉన్నాయి. అందులో 167 చెరువులు మాత్రమే వంద ఎకరాల సాగు విస్తీర్ణం ఉన్న చెరువులు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇక పది ఎకరాలు, అంతకంటే తక్కువ విస్తీర్ణం చెరువులు రెండు వేలకుపైగా ఉన్నా వాటిని ఇరిగేషన్, పంచాయతీరాజ్‌శాఖలు మాత్రం కుంటలు కిందనే లెక్కకడుతున్నాయి. తూము, మొరవ నిర్మాణం ఉన్న పాతచెరువులను మాత్రమే లెక్కలోకి తీసుకుంటున్నారు. ప్రస్తుతం వీటిల్లో నీటి నిల్వలను పరిశీలిస్తే, రాజంపేట రెవెన్యూ డివిజన్ మినహా మదనపల్లె, రాయచోటి డివిజన్లలో దాదాపు చెరువులన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్నింటిలో నీరు చేరినా తర్వాత ఇంకిపోయాయి. ఇక మిగిలిన చిన్నపాటి చెరువులు, కుంటల్లో మాత్రమే అక్కడక్కడా వర్షపునీరు నిల్వ చేరి పశువుల దాహం తీరుస్తున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగి ఎండలు ముదిరితే మాత్రం రెండు మూడు నెలల్లో అవి కూడా ఖాళీ కానున్నాయి. దీంతో రానున్న వేసవిలో తాగునీటికి, సాగునీటికి ఇబ్బందులు తప్పేలా లేవు. చెరువులు, కుంటలే కాదు..పడమట ప్రధానమైన నిమ్మనపల్లె బాహుదా ప్రాజెక్టు, తంబళ్లపల్లె పెద్దేరు ప్రాజెక్టు పరిస్థితి కూడా ఇంతే.

జిల్లాలోని మదనపల్లె, రాయచోటి ఏరియాలు భౌగోళికంగా కొండలు, గుట్టలతో ఎడారి ప్రాంతాన్ని తలపిస్తుండగా, రాజంపేట డివిజన్‌లోని రాజంపేట, రైల్వేకోడూరు ఏరియాలు కోస్తా ప్రాంతాన్ని గుర్తు చేస్తున్నాయి. ఇక మదనపల్లె, రాయచోటి ఏరియాల్లో సాగునీటి చెరువులు, కుంటలు, ఆయకట్టు భూములు ఎడారిని తలపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ప్రస్తుతం సాగునీటి ఎన్నికలకు ఎంపిక చేసిన (వంద ఎకరాలు ఆయకట్టు) చెరువులను పరిశీలిస్తే మదనపల్లె డివిజన్‌లో 63 చెరువులు, రాజంపేటలో 81, రాయచోటి డివిజన్‌లో 23 చెరువులు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మదనపల్లె, రాయచోటి డివిజన్లు విస్తీర్ణం పరంగా ఎక్కువైనా చెరువుల పరంగా తక్కువేనని గణాంకాలను బట్టి స్పష్టమవుతోంది. అదే రాజంపేట డివిజన్ విస్తీర్ణం పరంగా తక్కువే అయినా పెద్దచెరువులు పరంగా ఎక్కువగా నమోదయ్యాయి.

ఖరీఫ్ సీజన్‌లో వరుణుడు ముఖం చాటేయగా, రబీ సీజన్‌లోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. అక్టోబరు, నవంబరులో వర్షాలు పుష్కలంగా కురుస్తాయని, వీలైతే వరదలు ముంచెత్తే అవకాశ ముందనే రైతుల అంచనాలు తారుమారైనట్లు కనిపిస్తోంది. అటు అధికారులు, ఇటు రైతులు ఊహించినట్లు సాధారణ సీజన్ రెండు నెలలూ గడిచిపోతున్నా వరుణదేవుడు మాత్రం ఆశించిన స్థాయిలో కరుణించలేదు. రోజూ వాతావరణం చల్లబడటం, తుంపర్లు రాలడం, ఆకాశం మేఘావృతం కావడం మినహా ఎక్కడా ఆశించిన స్థాయిలో వర్షం పడలేదు. ఇక ప్రాజెక్టులు, పెద్ద పెద్ద చెరువులు నిండి మొరవ పోతాయనే ఆశలు కూడా రోజురోజుకు సన్నగిల్లుతున్నాయి. ఆ స్థాయిలో వర్షాలు లేకపోయినా భూగర్భ జలాలు బాగానే ఉన్నాయని, పంటలసాగు, తాగునీటికి ఇబ్బంది లేదని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఇందులో భాగంగానే ఈ రబీ సీజన్‌లో వర్షపాతం సాధారణం కంటే కూడా ఎక్కువగానే నమోదైందని చెబుతోంది. ఖరీఫ్ సీజన్ రైతును నట్టేట ముంచిందనే అంచనాలతో ప్రభుత్వం జి ల్లాలో 19మండలాలను కరువుగా ప్రకటించింది. అదే రబీ సీజన్ మాత్రం పంటల పరంగా ఆశాజనకంగా ఉంటుందని వ్యవసాయ, రెవెన్యూశాఖలు అంచనా వేస్తున్నాయి. ఇందులోభాగంగా ఈసారి జిల్లాలో 26 వేల హెక్టార్లలో పంటలు సాగయ్యేలా చూడాలని వ్యవసాయశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో వేరుశనగ, రబీ, ఉలవలు సాగు చేసేలా రైతుకు సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు, ఎరువులు, ఉలవలు పంపిణీ చేస్తోంది. వర్షాధారం తర్వాత కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే హంద్రీ-నీవా జలాలు ఈసారి కనుచూపుమేరా కనిపించడం లేదు. కృష్ణా జలాలతో పంటలు సాగు కాకపోయినా కాలువల్లో కృష్ణమ్మ ప్రవహిస్తే కనీసం భూగర్భజలాలు మరింత వృద్ధి చెందే అవకాశం ఉంది. కానీ వివిధ కారణాలతో కృష్ణా జలాలు రాకపోవడం రైతుకు తీరని నష్టాన్ని మిగిల్చినట్లేననే చెప్పాలి.

నిమ్మనపల్లె మండలం తవళం వద్ద చుక్కనీరు లేని కోమటివానిచెరువు



చెరువు నిండితేనే సాగు చేస్తా..

మా మండలంలోనే అగ్రహారం చెరువు చాలా పెద్దది. నూరు ఎకరాలకుపైగా ఆయకట్టు ఉన్న ఈ చెరువు కింద మూడేళ్లుగా ఆయకట్టు భూములు బీళ్లుగా ఉన్నాయి. మూడేళ్లుగా చెరువులో చుక్క నీరు లేదు. కొద్దో గొప్పో వచ్చినా పశువులకు తాగునీటికి సరిపోతున్నాయి. కానీ పంటలు సాగు చేయలేపోతున్నాం. చెరువు కింద బోర్లు ఉన్న రైతులు మాత్రమే పంటలు సాగు చేసుకుంటుండగా, చెరువు నీటి ఆధారంగా ఉన్న భూములు బీడుగా ఉంటున్నాయి. వర్షాభావంతో పంటసాగు లేక జీవనానికి ఇబ్బంది పడుతున్నాం.



- కె.నారాయణరెడ్డి, రైతు, రామసముద్రం మండలం



పంట భూములన్నీ బీళ్లే..

రెండు సీజన్‌లలో వర్షాలు పడితే బాహుదా ప్రాజెక్టు పుష్కలంగా ఉంటుంది. దీంతో సంవత్సరానికి రెండు పంటలు పండుతాయి. కానీ ఈసారి ఖరీఫ్‌లో ప్రాజెక్టులో నీళ్లు లేక పంట వేయలేదు. రబీ సీజన్‌లో వేద్దామంటే ఇంతవరకు వర్షం పడలేదు. ప్రాజెక్టులోకి చుక్కనీరు చేరలేదు. పది రోజుల్లో రబీ సీజన్ కూడా ముగిసిపోతుంది. వర్షం పడే పరిస్థితి కనిపించలేదు. ఇలా అయితే వర్షాధారంగా సాగు చేసుకుని జీవించే రైతుల పరిస్థితి ఎలా?

- ఎస్.రెడ్డిశేఖర్, రైతు, నిమ్మనపల్లె



అయ్యా.. మా భూములు లాక్కోవద్దు..

● జాయింట్ కలెక్టర్‌కు రైతుల మొర

విఠలం గ్రామం వద్ద భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

వాల్మీకిపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే వాల్మీకిపురం మండలంలో నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం అడిగిన మేరకు భూములు ఇచ్చాము.. మిగిలిన తమ అరకొర భూములను లాక్కోవద్దంటూ వాల్మీకిపురం మండలంలోని విఠలం, చింతలవారిపల్లె గ్రామాలకు చెందిన రైతులు వాపోయారు. బుధవారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మండలంలోని విఠలం గ్రామ సమీపంలో జాతీయ రహదారి నిర్మాణంలో రైతులు కోల్పోతున్న భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ రోడ్డు విస్తరణలో రైతులు కోల్పోతున్న భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆ ప్రాంతాల రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతులంతా సహకరించి భూములు ఇచ్చారని అయితే విఠలం గ్రామ పరిధిలో జాతీయ రహదారి పక్కగా పార్కింగ్ నిర్వహణ నిమిత్తం ఎంపిక చేసిన భూముల విషయాన్ని ప్రస్తావించగా ఆ ప్రాంత రైతులు తమ గోడును వెల్లబోసుకున్నారు. గతంలో జాతీయ రహదారి నిర్మాణానికి మా భూములను ఇచ్చామని, మళ్లీ పార్కింగ్ స్థలాల పేరిట భూములు కావాలని అడుగుతుండడంతో రైతులు ససేమిరా అన్నారు. గ్రామ సమీపంలో దాదాపుగా 20 మంది రైతులు సుమారు 4 ఎకరాలకుపైగా భూములు కోల్పోవడం పట్ల ససేమిరా అన్నారు. గతంలో జాతీయ రహదారికి ఇచ్చిన భూముల నష్టపరిహారంలో కూడా మాకు పూర్తి న్యాయం జరగలేదని విన్నవించారు. అంతేకాకుండా రహదారి నిర్మాణ ప్రాంతంలో ఇరువైపులా వ్యవసాయ పొలాలు ఉన్నాయని కనీసం రైతులకు అటు ఇటుగా వెళ్లేందుకు దారి సమస్యను పరిష్కరించే ఆలోచన కూడా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కలెక్టర్, ఇతర అధికారులకు ఇప్పటికే నివేదించామన్నారు. వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు రైతుల సౌకర్యార్థం అండర్ పాస్ నిర్మాణం కోరినా పట్టించుకోలేదన్నారు.

ప్రస్తుతం తమకు ఉన్న అరకొర భూములను కూడా మళ్లీ ఇచ్చేయాలంటూ అధికారులు ఒత్తిడి చేయడం సబబు కాదన్నారు. రైతుల విషయంలో సమగ్రంగా పరిశీలించి న్యాయం చేయాలని కోరగా స్పందించిన జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ గ్రామ సమీపంలో జరుగుతున్న జాతీయ రహదారి ప్రాంతంలో పరిశీలనలు చేపట్టి ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఉన్న ప్రాంతంలో రహదారి పార్కింగ్ నిర్వహణ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. గ్రామ సమీపంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ పామిలేటి, సర్వేయర్ పూర్ణచంద్ర, ఆర్ఐ సుగుణ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న ట్రాక్టర్ల డ్రైవర్లు



యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

6

● 15 ట్రాక్టర్లు స్వాధీనం
● పోలీసుస్టేషన్‌లో డ్రైవర్ల ఆందోళన
● రీచ్ సిబ్బందితో వాగ్వాదం

రైతులకు పరిహారం చెల్లించండి


6

● రహదారిపై బాధితుల నిరసన

లంకమల అందాలు చూడతరమా..

● గలగల పారే సెలయేరు
● బండరాళ్లపైనే అందమైన చెట్లు
● అబ్బురపరుస్తున్న పచ్చని కొండలు

6



నగల దుకాణాలపై అధికారుల దాడులు

6



సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● అపార్, జియోట్యాగ్ పనుల్లో పురోగతి సాధించాలి ● కలెక్టర్ చామకూరి శ్రీధర్



లక్కిరెడ్డిపల్లె/రామాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేసి తక్షణ ఎ ే ం పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన లక్కిరెడ్డిపల్లె, రామాపురం ఎంపీడీవో కార్యాలయాల్లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించాలన్నారు. అలాగే ఫ్రీ హోల్డ్ భూములు, చుక్కల భూములు, మ్యుటేషన్‌లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇళ్ల నిర్మాణాల జియోట్యాగ్ పనులు వేగవంతం చేయాలన్నారు. యంత్రాల ద్వారా ఇసుకను తీస్తుంటే వెంటనే వాటిని సీజ్ చేసి జరిమానా విధించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల అపార్ ఐడీ, బ్యాంక్ అకౌంట్‌లకు ఆధార్ లింకేజిలను పరిశీలించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని తెలిపారు. అలాగే సర్వే రాళ్లపై ఉన్న బొమ్మలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. లక్కిరెడ్డిపల్లె మండలంలో 13,188 రాళ్లపై బొమ్మలు ఉన్నాయని ఇప్పటివరకు 1476 రాళ్లపై ఉన్న బొమ్మలను తొలగించామని రెవిన్యూ సిబ్బంది కలెక్టర్‌కు తెలిపారు. రామాపురం మండలంలో అర్జీల పరిష్కారంలో ప్రగతి బాగుందని, అలాగే అన్ని రెవెన్యూ అంశాల్లో పెండింగ్‌లో లేరని, ఇలాగే కొనసాగించి మండలానికి మంచిపేరు తీసుకురావాలని రెవెన్యూ అధికారులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన 18పనుల్లో 11పనులు పూర్తి చేశారని, మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కడప-రాయచోటి ప్రధాన రహదారిలో చిట్లూరు వద్ద ప్రధాన రహదారి నుంచి ఆదర్శ పాఠశాల వరకు నిర్మిస్తున్న రోడ్డును కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రామాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి హాజరు పట్టికను పరిశీలించారు. ఆసుపత్రిలో ఎంత మంది వైద్యులు, నర్సులు, సిబ్బంది ఉన్నారు. ఖాళీల వివరాలు, ఆసుపత్రికి ఎక్కువగా ఎలాంటి రోగులు వస్తున్నారు. మందులు స్టాక్ ఉన్నాయా, మందుల కొరత ఏమైనా ఉందా అని ఆరా తీశారు. రోగులందరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు వెంకరత్నం, శివయ్య, సత్యనారాయణ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో రెడ్డెయ్య, హౌసింగ్ ఏఈ జనార్ధన, సర్వేయర్ మదన్‌మోహన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు

'అపార్' కష్టాలు

● పంచాయతీ కార్యాలయానికి పోటెత్తుతున్న తల్లిదండ్రులు
● ఎవరి దరఖాస్తులు వారే వెతుక్కుంటున్న వైనం



దరఖాస్తులను వెతుక్కుంటున్న ప్రజలు

పీలేరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒకే దేశం-ఒకే విద్యార్థి అన్న విధానంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కష్టాలు తప్పడం లేదు. అపార్ నమోదు కోసం ఆధార్ కార్డుల్లోని జనన తేదీల్లో మార్పులు, జనన ధృవీకరణ పత్రాల్లో ఇంటి పేర్ల నమోదు కోసం తల్లిదండ్రులు ఆధార్ నమోదు కేంద్రాలు, గ్రామ పంచాయతీలకు నిత్యం పోటెత్తుతున్నారు. అయితే వారు అందిస్తున్న దరఖాస్తులను ప్రాసెస్ చేసేందుకు సమయం పడుతుండడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పీలేరు గ్రామ పంచాయతీలోని గ్రామ సచివాలయం, జనన నమోదు కేంద్రంలో వారం రోజులుగా విపరీతమైన రద్దీ నెలకొంది. కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్న దరఖాస్తులను ప్రాసెస్ చేసేందుకు సమయం పడుతుండడంతో సచివాలయం, పంచాయతీ సిబ్బంది వారం రోజులు సమయం తీసుకుంటున్నారు. అయితే ఆయా రోజుల్లో అందిన దరఖాస్తులను జాగ్రత్త చేసేందుకు వారు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సచివాలయంలో దరఖాస్తులు ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. పీలేరు సచివాలయం-1లో ఇచ్చిన దరఖాస్తులను ప్రజలే వెతుక్కోవాల్సిన పరిస్థితి బుధవారం కనిపించింది. వారం, పది రోజుల క్రితం ఇచ్చిన దరఖాస్తులను అధికారులు పట్టించుకోకపోవడంతో తాము ఎన్నో ఆశలతో బుధవారం పంచాయతీ కార్యాలయానికి వచ్చామని, తీరా చూస్తే తమ దరఖాస్తులు ఎక్కడ ఉన్నాయో అంతుచిక్కని దుస్థితి నెలకొందని పలువురు తల్లిదండ్రులు వాపోయారు. ఈ పరిస్థితిపై పంచాయతీ కార్యదర్శి జ్ఞానశేఖర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సర్వే పనుల కోసం వెళ్లడంతో ఇబ్బంది ఎదురైందని, దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలిస్తామన్నారు. అయితే తమ దరఖాస్తులనే పట్టించుకోని వారు ఇక తమ పనులు ఏం చేస్తారని ప్రజలు విమర్శిస్తున్నారు.



బారులు తీరిన దరఖాస్తుదారులు

ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం స్వాధీనం

● హంద్రీ-నీవా కాలువ భూమిలో ప్రభుత్వ బోర్డు


కురబలకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు పంచాయతీ పరిధిలో ఆక్రమణకు గురైన హంద్రీ-నీవా కాలువ భూమిని రెవెన్యూ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. అంగళ్లు పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్-220లోని హంద్రీ-నీవా కాలువకు చెందిన భూమిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకుని ప్లాట్లు వేసి విక్రయించారు. ఈ విషయాన్ని 'రియల్ ఎస్టేట్ వ్యాపారుల బరితెగింపు...హంద్రీ-నీవా కాలువ భూమిని అమ్మేశారు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. దాదాపుగా 1.60 ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు విచారణలో తేలింది. ప్రస్తుతం ఈ భూమి విలువ ప్రైవేట్ మార్కెట్‌లో రూ.5 కోట్లకు పైగా పలుకుతుంది. దీనిపై రెవెన్యూ, హెచ్ఎన్ఎస్ అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన భూమిలో ప్రభుత్వానికి చెందిన భూమిగా నిర్ధారిస్తూ బోర్డు నాటారు.

ఆంధ్రజ్యోతి సాక్షి



ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు

లంకమల అందాలు చూడతరమా...




లంకమల అభయారణ్యంలో కనువిందు చేస్తున్న జలపాతం


● గలగల పారే సెలయేరు - బండరాళ్లపైనే అందమైన చెట్లు

● అబ్బురపరుస్తున్న పచ్చని కొండలు


రాజంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నియోజకవర్గంలోని సిద్దవటం పరిధిలోని లంకమల అభయారణ్యం చూపరులను కట్టిపడేస్తోంది. మండల కేంద్రానికి కేవలం 8 కిలోమీటర్ల దూరంలో లంకమల అడవుల్లో నిత్యపూజకోన ఉంది. కార్తీక మాసం సందర్భంగా కడప, నెల్లూరు, అన్నమయ్య జిల్లావాసులు వేలాదిమంది ఈ అభయారణ్యానికి వచ్చి నిత్యపూజకోనను సందర్శిస్తుంటారు. నిత్యపూజకోనకు ఎంతో భక్తిగా వెళ్లే భక్తులు అభయారణ్యంలోని అందాలను ఆస్వాదిస్తున్నారు. 4 కిలోమీటర్ల మేర నడిచివెళ్లే ఈ మార్గంలో పెద్ద పెద్ద బండరాళ్లు, ఎత్తయిన కొండలు పచ్చదనం పరుచుకున్న గుట్టలు, లోయలు, భారీ వృక్షాలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. భారీ వర్షాలు లేనప్పటికీ ఒక మోస్తరు వర్షం వల్ల నిత్యపూజకోన వద్ద గుండంలో పైనుంచి జలపాతంలా నీరు పడుతూ ఎంతో ఆకట్టుకుంటోంది. దారి వెంబడి చెట్ల వేర్లు ఊయల రూపంలో మారి అందరినీ కట్టిపడేస్తున్నాయి. కొండలపై ఉన్న బండరాళ్లు ఒక్కొక్కటి ఒక్కో ఆకృతిలో ఉంటూ చూడముచ్చటగొలుపుతున్నాయి. నిత్యపూజకోనకు వెళ్లే వేలాదిమంది భక్తులు ఇక్కడ అడవితల్లి అందాలను చూసి ఒకవైపు భక్తిభావంతో, మరోవైపు ప్రకృతి అందాలను చూసి తన్మయత్వం చెందుతున్నారు.



పచ్చదనంతో చూపరులను కట్టిపడేస్తున్న లంకమల అభయారణ్యం



రాళ్లను దాటుకుంటూ నిత్యపూజకోనకు వెళుతున్న భక్తులు



ఓ వైపు పచ్చదనం.. మరోవైపు మోడువారిన చెట్టు



లంకమలలో ఇలాంటి అందాలెన్నెన్నో...

ఆటోను ఢీకొన్న ఐచర్ వాహనం

● ఒకరి మృతి...

● 12 మందికి గాయాలు



ప్రమాద స్థలంలోనే మృతి చెందిన బాలక లక్ష్మీదేవి





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చిన్నమండెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కూలీలతో వెళుతున్న ఆటోను ఐషర్ వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా 12 మందికి గాయాలయ్యాయి. ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు మండలంలోని కలిబండకు చెందిన 12 మంది కూలీలు బెస్తపల్లిలో కూలి పనులకు వెళ్లారు. పని పూర్తి చేసుకుని సాయంత్రం ఆటోలో స్వగ్రామానికి వెళుతుండగా బెస్తపల్లి క్రాస్ సమీపంలోని డాబా వద్ద మదనపల్లి వైపు వెళుతున్న ఐషర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలక లక్ష్మీదేవి (48) అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన 12 మందికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మృతి చెందిన లక్ష్మీదేవికి ఒక కుమారుడు ఉన్నాడు. భర్త దాదాపు పదేళ్ల క్రితం చనిపోయాడు. తమ గ్రామానికి చెందిన ఒకరు మృతి చెంది, 12 మంది గాయపడడంతో కలిబండలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులకు పరిహారం చెల్లించండి

రహదారిపై బాధితుల నిరసన



రోడ్డుపై నిరసన తెలుపుతున్న గ్రామస్థులు



బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దార్ తపశ్వని

కురబలకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి రోడ్ల విస్తరణకు సంబంధించి భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని భూబాధితులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అంగళ్లు పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూములు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించకపోవడంతో పనులను అడ్డుకుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ సర్వేనంబరు 130, 132లలో విలువైన భూములను కోల్పోయామని, దాదాపుగా పనులు పూర్తి కావస్తున్నా ఇప్పటి దాకా పరిహారం చెల్లించలేదన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా కాంట్రాక్టర్ సిబ్బంది తమపై కేసులు పెడుతామని బెదిరిస్తున్నట్లు పేర్కొన్నారు.

అనంతరం తహసీల్దార్ తపశ్విని అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడి వచ్చే నెలాఖరులోగా నష్టపరిహారం అందిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కాగా ముదివేడు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం, దిండుగల్లు జిల్లా, పెరియారుకోటకు చెందిన మారుముత్తు (33) మదనపల్లె పట్టణం దేవతానగర్‌లో కాపురం ఉంటున్నాడు. ఆదివారం సొంత పని నిమిత్తం వెళ్లి వస్తున్న అతను బైపాస్ వద్ద రోడ్డుప్రమాదంలో గాయపడ్డాడు. స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి వివాహమై ఆరునెలలు మాత్రమే అయింది. భార్య ఫిర్యాదు మేరకు మదనపల్లె తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రొద్దుటూరు ప్రభుత్వ ఖాజీగా ఆరిఫుల్లా

కలికిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు ప్రభుత్వ ఖాజీగా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన మహబూబ్‌బాషా కుమారుడు షేక్ ఆరిఫుల్లాను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ప్రొద్దుటూరుకు మరో ఖాజీ కొనసాగుతున్న నేపథ్యంలో పట్టణ అవసరాల రీత్యా మరో ఖాజీని నియమిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. కొత్తగా నియమితులైన ఆరిఫుల్లా పదేళ్లపాటు ఖాజీగా కొనసాగుతారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఖాజీగా బాధ్యతలు నిర్వహిస్తూ ముస్లిం వివాహాలను చట్టబద్ధంగా నిర్వహించాలని ప్రభుత్వం షరతులు విధించింది. చట్టాన్ని అతిక్రమించి వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని షరతు విధించారు.

భూమి కౌలుకు ఇస్తే కబ్జా చేశారు



వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్

రామసముద్రం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమి కౌలుకు ఇస్తే కబ్జా చేశారని ఓ బాధితురాలు వాపోయింది. ఆమె వివరాల మేరకు.. మండలంలోని నారిగానిపల్లె పంచాయతీ ఎర్రనేలపల్లె గ్రామానికి చెందిన లక్ష్మమ్మ భర్త వెంకటరమణరాజుకు సర్వే నెంబరు 218/1సీ1లో 2.75 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని ఇదే గ్రామానికి చెందిన సురేంద్రరాజుకు కౌలుకు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆ భూమికి సంబంధించి కౌలుదారుడు దొడ్డిదారిన పట్టా రూపొందించుకున్నట్లు ఆమె ఆరోపించింది. ఈ విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. దీనిపై స్పందించిన కలెక్టర్ లక్ష్మమ్మ భూమిని కబ్జాదారుల నుంచి విడిపించి బాధిత మహిళకు అప్పగించాలని తహసీల్దార్ నిర్మలాదేవికి ఆదేశాలిచ్చారు. దీంతో బుధవారం రెవెన్యూ, పోలీసు సిబ్బందితో తహసీల్దార్ భూమిని పరిశీలించి సర్వే చేశారు. కబ్జాదారుల నుంచి భూమిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. రికార్డులను తారుమారు చేసి భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నగల దుకాణాలపై అధికారుల దాడులు

● దుకాణాలలో బంగారు నిల్వలు.. అమ్మకాలపై రోజంతా తనిఖీలు

● అధికారుల రాకతో దుకాణాల మూత



బంగారు దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

బి.కొత్తకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణంలోని బంగారు దుకాణాలపై వాణిజ్య పన్నుల శాఖాధికారులు బుధవారం పెద్దఎత్తున దాడులు నిర్వహించారు. 15 మంది అధికారులు బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో 5 దుకాణాల్లోకి ప్రవేశించి ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. బుధవారం ఉదయం 11 నుంచి రాత్రి పొద్దుపోయే వరకు తనిఖీలు కొనసాగాయి. బి.కొత్తకోట పట్టణంలో దాదాపు 30 బంగారు దుకాణాలు ఉండగా, వీరు యూనియన్‌గా ఏర్పడి బంగారం కొనుగోలు, అమ్మకంపై తప్పుడు లెక్కలు చూపి ట్యాక్స్‌లు ఎగ్గొడుతున్నారని, నాణ్యతలేని బంగారాన్ని 22 క్యారెట్ బంగారం అని, హాల్‌మార్క్ అని కస్టమర్లను మోసగిస్తున్నారని, నగలు కొనుగోలు చేసిన వారికి తెల్లకాగితంలో జీఎస్టీ లేని బిల్లులు ఇష్టానుసారం వేసి, మోసగించి రూ.లక్షలు కొల్లగొడుతున్నారని ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ కేవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ రవిశంకర్, కడప, మదనపల్లె, రాయచోటి, పులివెందుల వాణిజ్యపన్నులశాఖ అసిస్టెంట్ కమిషనర్లు సునీత, మౌనిక, వరలక్ష్మి, జ్ఞానానందరెడ్డిలతో పాటు జీఎస్టీ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఎంపిక చేసుకున్న 5 దుకాణాలలోకి వెళ్లి రికార్డులను, బిల్లులను స్వాధీనం చేసుకున్నారు. బంగారు నిల్వలు, రోజువారీ వాస్తవ విక్రయాలు, బయటి నుంచి బంగారం కొనుగోళ్లపై ఆరా తీశారు. అధికారుల తనిఖీల సమాచారంతో పట్టణంలోని మదనపల్లె రోడ్డు, బెంగళూరు రోడ్డులోని పలు దుకాణాలు మూసివేసి యజమానులు జారుకున్నారు. తాము వెళ్లిన షాపులలో మాత్రం అధికారులు క్షుణ్ణంగా రాత్రి వరకు తనిఖీలు చేస్తూనే ఉన్నారు. బంగారం ఎక్కడి నుంచి కొనుగోలు చేస్తున్నారు. వాటి బిల్లులు, దుకాణాలలో రోజువారీ వ్యాపారం ఎంత? వీరు చూపిస్తున్నది ఎంత? బంగారు నగలు ఇస్తామంటూ చీటీల పేరుతో ప్రజల నుంచి రూ.కోట్లలో నగదు వసూళ్లపై విచారణ చేశారు. అయితే తనఖీలలో ఏ మేరకు అక్రమాలు గుర్తించారు, దుకాణాలపై వచ్చిన ఆరోపణలలో వాస్తవం ఎంత అనే విషయమై ఈ అధికారులు బయటకు వెల్లడించలేదు.

విక్రయాలపై ట్యాక్స్ చెల్లించాల్సిందే

కేవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ కమర్షియల్ ట్యాక్స్

బంగారు విక్రయాలపై షాపు యజమానులు లక్షకు రూ.3 వేలు ట్యాక్స్ చెల్లించాల్సిందే. అలా లేనిపక్షంలో చర్యలు తీసుకుంటాం. అయితే బంగారు 22 క్యారెట్ వుందా లేదా, హాల్‌మార్క్, నాణ్యత తదితర విషయాలు తూనికలు కొలతల అధికారులు చూస్తారు. బంగారంపై చేస్తున్న లావాదేవీలు, కొనుగోళ్లు, అమ్మకాల బిల్లులు, మా కార్యాలయంలో ఉన్న వివరాలకు సరిపోతాయా లేదా అనేది వాణిజ్య పన్నులశాఖ అధికారులుగా మేం విచారిస్తాం.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

● 15 ట్రాక్టర్లు స్వాధీనం

● పోలీసుస్టేషన్ ఎదుట డ్రైవర్ల ఆందోళన

● రీచ్ సిబ్బందితో వాగ్వాదం



పోలీసుస్టేషన్ వద్ద ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు



పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

ఒంటిమిట్ట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్జీపల్లి ఇసుకరీచ్ నుంచి పెద్దఎత్తున ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సచివాలయం నుంచి అనుమతి పొందిన వారికి మాత్రం రీచ్‌లోకి వెళ్లి ఇసుక తీసుకోవాలని నిబంధనలు ఉన్నా అందుకు విరుద్ధంగా ఎవరికి తోచిన రీతిలో వారు అక్రమంగా ఇసుకను తరలించుకుపోతున్నారు. రాత్రిపూట ఎక్స్‌కవేటర్ల సాయంతో టిప్పర్ల ద్వారా బయటకు తరలించడం, ఉదయం కూలీలతో ఎలాంటి బిల్లులు లేకుండా ట్రాక్టర్ల ద్వారా తరలించేస్తున్నారు. వీటితో పాటు రీచ్‌కు దగ్గర ఉన్న గ్రామస్థులు మాకు ఇసుకలో పర్సెంటేజీ ఇవ్వాలని మంగళవారం రాత్రి పెద్దఎత్తున రాళ్లను రోడ్డుకు అడ్డం పెట్టి వాహనాలు వెళ్లకుండా ఆందోళన చేపట్టారు.

మా గ్రామం నుంచి తీసుకెళుతున్న ఇసుకకు తమకు మామూళ్లు చెల్లించాలని లేకుంటే ఇసుకను తీసుకెళ్లేందుకు అనుమతి ఇవ్వమని తేల్చి చెప్పారు. ఉదయం కడప నుంచి వెళ్లిన ట్రాక్టర్‌లు రీచ్‌లోకి వెళ్లకుండా అడ్డుపడడంతో స్థానిక ఎస్ఐ శివప్రసాద్ జోక్యం చేసుకుని రోడ్డుకు అడ్డం పెట్టిన కారు, రాళ్లు తొలగించాలని లేకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో వారు వెనక్కు తగ్గారు. ట్రాక్టర్లు వెళ్లిన మరికొద్దిసేపటికే ఇసుక రీచ్ సిబ్బంది ఎక్స్‌కవేటర్లను రోడ్డుకు అడ్డంగా పెట్టి తమకు తెలియకుండా నదిలోకి వెళ్లి ఇసుకను తరలిస్తున్నారని రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయడంతో పోలీసు అధికారులు నదిలో ఉన్న 15 ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి తహసీల్దార్ రమణమ్మకు అప్పజెప్పారు. ఇసుక క్వారీకి చెందిన సిబ్బంది వెంకటేశ్వర్లు తహసీల్దార్‌తో మాట్లాడి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు రావడంతో అక్కడే ఉన్న ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లు ఒక్కసారిగా ఆయనతో ఘర్షణకు దిగారు.

మా ట్రాక్టర్లను కావాలనే పోలీసులకు పట్టించారని, తాము 900 రూపాయలు నగదు ఇచ్చి ఇసుకను తీసుకెళుతున్నామని అప్పుడు లేని ఇబ్బంది ప్రస్తుతం ఎందుకు వచ్చిందని, తమను ఎందుకు పోలీసులకు పట్టించారని ప్రశ్నించారు. అనంతరం పోలిసుస్టేషన్ ఎదుట ట్రాక్టర్ డ్రైవర్లు ఆందోళనకు దిగారు. ఆ సమయంలో స్టేషన్‌లో రైటర్ సుబ్బరాజు ఒక్కరే ఉండడంతో పెద్దఎత్తున అరుపులు, కేకలతో పోలీసుస్టేషన్ హోరెత్తింది. వెంటనే సిబ్బందికి అక్కడికి చేరుకుని ఇరువర్గాల వారిని స్టేషన్ నుంచి పంపించివేశారు.

ఉచిత ఇసుక అంటే తీసుకెళుతున్నాం...



మాకు నిబంధనలు తెలియవు. రోజు మాదిరిగానే వేకువజామున ఇసుకను తరలించేందుకు నదిలోకి వెళ్లాము. ప్రభుత్వం ఇసుక అంటేనే తీసుకెళుతున్నాము. అక్కడ కూలీలతో ఇసుకను నింపుకున్నాము. అనంతరం పోలీసులు వచ్చి ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు. రోజు మా వద్ద డబ్బులు తీసుకుని ఇసుక లోడు చేసేవారు. అలాగే రోజువారీగా తరలించాం. ప్రభుత్వ నిబంధనల బోర్డు ఏర్పాటు చేసి ఎప్పటి నుంచి ఎప్పటివరకు అనే వివరాలను ఏర్పాటు చేయాలి.

- అంజనేయులు, ట్రాక్టర్ డ్రైవర్, కడప.

ఉపాధి ద్వారా గోకులాలను పూర్తి చేయాలి

కలికిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు మంజూరైన గోకులాలను (పశువుల షెడ్లు) త్వరగా పూర్తి చేయాలని కలికిరి క్లస్టర్ డ్వామా ఏపీడీ శ్రీనివాసులు ఆదేశించారు. ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వలస వెళ్లిన, లేదా చనిపోయిన కూలీల పేర్లను జాబ్ కార్డుల జాబితా నుంచి తొలగించాలన్నారు. అదే విధంగా కొత్తగా కార్డులు కోరే కూలీలకు వెంటనే జాబ్ కార్డులు జారీ చేయాలన్నారు. వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల నుంచి చదువుకున్న వారిని గుర్తించి వారికి ఉన్నతి కార్యక్రమం ద్వారా పారిశ్రామిక శిక్షణకు పంపాలని ఆదేశించారు. అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో సుజాత, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అవినాశ్ అనుచరులు నా కార్లు తీసుకున్నారు

● అవినాశ్‌రెడ్డి అనుచరులు నా కార్లు తీసుకున్నారు ● ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు ● నాకు న్యాయం చేయండి
● రంగారెడ్డి జిల్లాకు చెందిన బాధితుడి వేడుకోలు ● సోషల్ మీడియాలో వీడియో చక్కర్లు

కడప, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నా వాహనాలను కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరులు అద్దెకు అని తీసుకుని.. తిరిగి ఇవ్వకుండా ఇబ్బందుల పాలుచేస్తున్నారని తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకు చెందిన సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు. అందులో తెలిపిన మేరకు..
రంగారెడ్డిలో ట్రావెల్స్ నడుపుతుండేవాడినని సతీష్‌కుమార్ తెలిపారు. ఒక రోజు తెలంగాణ రాష్ట్రం వికారాబాద్‌కు చెందిన మణిరాజ్ వచ్చి నుంచి మూడు వాహనాలు బాడుగు ఇవ్వాలని కోరాడన్నారు. పులివెందుల మెడికల్ కళాశాల వద్ద ఈ వాహనాలను నడిపేందుకు రోజుకు రూ.1500 చొప్పున నెలకు రూ.45,000 బాడుగకు మాట్లాడుకున్నామన్నారు. అప్పటికే మణిరాజ్ అనేకమార్లు తనవద్ద వాహనాలను బాడుగకు తీసుకున్నాడన్నారు. ముందుగా మూడు వాహనాలను తీసుకెళ్లారన్నారు. తర్వాత మరో రెండు వాహనాలు తీసుకెళ్లారన్నారు. ఈ మేరకు రెండు మూడు నెలల పాటు వాహనాలకు సంబంధించిన బాడుగ కూడా చెల్లించారన్నారు. మణిరాజ్ తనవద్దకు వచ్చి కార్లు రిపేరు వచ్చాయని, ప్రస్తుతం బాడుగ కూడా ఇవ్వలేనని, రూ.2లక్షలు డబ్బు కావాలని అడిగారన్నారు. తన వాహనాలు అతనివద్ద ఉన్నాయి కదా అని రూ.2లక్షలు ఇచ్చానన్నారు.
అవినాశ్‌రెడ్డి అనుచరులైన పులివెందులకు చెందిన మహిళా ఎంపీటీసీ, వేంపల్లె జడ్పీటీసీ రవి, ప్రసాదరెడ్డి, శంకర్‌రెడ్డి తన వాహనాలను తీసుకెళ్లారన్నారు. బాడుగకు ఇచ్చిన కార్లు తిరిగిరాకపోవడంతో పాటు తీసుకెళ్లిన వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారన్నారు. దీంతో తాను 2022లో పులివెందుల వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసి తనకు సహాయం కావాలని కోరానన్నారు. దీంతో కార్లు ఎక్కడున్నాయో గుర్తించారన్నారు. కానీ పోలీసులు ఉన్నతాధికారులు లేరని, వారికి చెప్పి ఇస్తామని చెప్పారన్నారు. అయితే పథకం ప్రకారం శంకర్‌రెడ్డి, ప్రసాదరెడ్డి తనకు కాల్ చేసి కార్లు ఇస్తామని రమ్మని చెప్పారన్నారు. తాను అక్కడకు వెళ్లగానే ఇడుపులపాయలోని ఒక భవనంలోకి తీసుకెళ్లి అక్కడ ఇష్టమొచ్చినట్లు కొట్టి, తిట్టి చంపేస్తామని బెదిరించారన్నారు. ప్రసాదరెడ్డి, శంకర్‌రెడ్డిలు వేరేవారికి ఫోన్ చేసి ఇతను చెప్పినా వినడం లేదని, ఫ్రస్టేషన్‌లో ఉన్నాడని, ఇతనికి ఏదైనా తాపించి బిల్డింగ్ నుంచి తోసేస్తే ఆత్మహత్య కింద పోతుందని వాళ్ల మాట్లాడుకున్నారన్నారు. దీనిని గమనించిన తాను తన మిత్రునికి ఫోన్ చేసి కారు తీసుకురమ్మని చెప్పానన్నారు. తన స్నేహితులు వచ్చిన తర్వాత ఎలాగోలా అక్కడ నుంచి తప్పించుకున్నానన్నారు. ఎంపీటీసీ మహిళ అయినప్పటికి తనను ఇష్టమొచ్చినట్లు దుర్భాషలాడిందన్నారు. పులివెందుల పోలీసులు వైసీపీ నాయకుల చెప్పుచేతల్లోనే పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం మారినా అక్కడ మాత్రం కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన అనుచరులైన శంకర్‌రెడ్డి మాటే చెల్లుతోందన్నారు. 2022లో కేసు పెట్టినప్పుడు పోలీసులు తనకు ఎలాంటి సహకారం అందించలేదన్నారు. తాను ఏమి అడిగినా ఎంపీ అవినాశ్‌రెడ్డి పేరు వినిపించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లను ఒకటే కోరుతున్నా.. నాకు న్యాయం చేయండి అన్నారు. తనకు ఇప్పటికి బెదిరింపు కాల్స్ వస్తున్నాయన్నారు.


రంగారెడ్డి జిల్లాకు చెందిన బాధితుడు సతీశ్‌కుమార్

సోషల్ మీడియాలో వైరల్

ఈ వీడియో సోషల్ మీడియాలో తిరుగుతోంది. ఇటీవలే మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో కదలిక వచ్చింది. అలాగే సోషల్ మీడియాలో బూతు పోస్టులు పెడుతుండడంతో ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరుడు వర్రా రవీంద్రరెడ్డిని అరెస్టు చేశారు. మరికొందరి కోసం వేట కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ వీడియో చక్కర్లు కొట్టడంతో వైసీపీ నేతలు కలవరపడుతున్నారు. అయితే తెలంగాణలో అద్దెకు తెచ్చిన వాహనాలను పులివెందుల, వేంపల్లెలో తాకట్టుపెట్టారు. అలా పెట్టిన వాహనాలను వేంపల్లెకు చెందిన వైసీపీ నేతలు తక్కువ డబ్బుతో తాకట్టు నుంచి తీసుకున్నారు. ఆ వాహనాలలో తిరిగేవారు. అయితే అసలు ఓనర్లు ఇక్కడకు వచ్చి ఇక్కడున్న వాహనాలను తీసుకెళ్లారు. సతీశ్‌కుమార్ అనే వ్యక్తి ఇంకా మూడు కార్లు ఉన్నాయని, పోలీసులకు చెప్పినట్లు సమాచారం.

ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా గంగిరెడ్డి, పద్మలత


గంగిరెడ్డి, పద్మలత, శివప్రసాద్, విలియంరాజ్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కడప ఎంఈఓ గంగిరెడ్డి, మైదుకూరు ఎంఈఓ పద్మలత ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బుధవారం కడప కలెక్టరేట్ సభా భవనంలో జరిగిన సమావేశానంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్ను కున్నారు. జిల్లా కోశాధికారిగా ఎర్రగుంట్ల ఎంఈఓ ఈఎల్ బీఎస్ శివప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా అట్లూరు ఎంఈఓ విలియంరాజ్‌ను ఎన్నుకున్నారు. వీరితో పాటు కార్యదర్శులు, మిగతా కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.

ఆర్.ఓ.సి. నెం. 260/జి1/2020 నగరపాలక సంస్థ, కడప.
తేది : 20.11.2024

బహిరంగ వేలం ప్రకటన

కడప నగరపాలక సంస్థకు చెందిన మద్రాసురోడ్డులోని వై.యస్.ఆర్. ఆడిటోరియం 2024-25 సం॥నకు సంబంధించి తేది: 01.12.2024 నుండి 30.11.2025 (12 నెలలకు) కాలపరిమితికి మాత్రమే నోటిఫికేషన్ నందు తెలుపబడిన రేట్ల ప్రకారము తేది : 25.11.2024 అనగా సాయంకాలం 5.00 గం॥లకు నగరపాలక సంస్థ సమావేశ భవనమునందు బహిరంగ వేలము జరుపబడును. కావున సదరు వేలములో పాల్గొనదలచిన వారు ఈ క్రింద కన బరచిన ప్రకారము సాల్వెన్సి సర్టిఫికేట్‌తో పాటు వేలము డిపాజిట్టు చెల్లించి సంబంధిత దరఖాస్తునకు జతపరచి కార్యాలయమునందు వేలంపాట మొదలు పెట్టె సమయానికి అనగా తేది: 25.11.2024 ఉదయం 11.00 గం॥ లోపు సమర్పించవలసి వుండవలెను. **ఈ నగరపాలక సంస్థ వారికి ఆస్తి, నీటిపన్నులు పూర్తిగా చెల్లింపు చేయవలసి వుండును. గత కాంట్రా క్టులో కిస్తులు, స్టాంపు డ్యూటీలు, సర్వీసుటాక్సు మరియు ఇతరములు పాత బకాయిలు ఉన్నచో అటువంటి వారు సదరు వేలములో పాల్గొనుటకు అనుమతించబడదు. ఒకవేళ అట్టి బకాయిలు ఉన్నచో సదరు బకాయిలు అన్నియు పూర్తిగా నగరపాలక సంస్థయందు చెల్లింపుచేసి బకాయిలు ఏమియును లేనట్టు నగరపాలక సంస్థ, కడప వారి ద్వారా సర్టిఫికేట్ పొంది వేలములో పాల్గొనవలసి యుండును.**
వివరములు :

క్రమ సంఖ్య	గుత్త వివరములు	చెల్లింపు చేయవలసిన డిపాజిట్టు	సమర్పించవలసిన సాల్వెన్సి సర్టిఫికేట్ విలువ
1.	మద్రాసు రోడ్డులోని వై.యస్.ఆర్. ఆడిటోరియం	రూ. 5,00,000/-	రూ. 1,00,000/-

పై తెలిపిన డిపాజిట్ పే-ఆర్డరు / డి.డి. రూపములో చెల్లింపు చేయవలసి ఉండును. హెచ్చుపాట పాడిన గుత్తదారుడు వేలము ముగిసిన పిదప **డిపాజిట్‌తో కలిపి 1/4 వంతు వెంటనే చెల్లించవలెను. మిగిలిన మొత్తము 3/4వంతు లీజు కేటాయించిన 06 మాసముల లోపల ప్రతినెల 05వ తేది లోపల సర్వీసు టాక్స్‌తో కలిపి చెల్లించవలెను. సదరు హెచ్చుపాట పాడిన మొత్తము 1/4వంతు అనగా 25 శాతం చెల్లించిన పిదప మిగిలిన 3/4అనగా 75శాతంనకు బ్యాంక్ గ్యారెంటీ మరియు పోస్ట్ డేటెడ్‌చెక్కులు ఇవ్వవలసి వుండును. మరియు గుత్త కాలమునకు సంబంధించి రిజిస్ట్రార్ వారి కార్యాలయమునందు గుత్త దారుడే తనసొంత ఖర్చులతో రిజిస్టర్ చేయించుకొని ఈ కార్యాల య మునకు సమర్పించవలసి వుండును. మరియు ఏదైనా కారణము చేత వేలం, వాయిదా వేయు అధికారము లేదా రద్దుచేయుటకు కమీషనర్ గారికి పూర్తి అధికారము కలదు.** ఇతర వివరములకు నగరపాలక సంస్థ కార్యాలయములోని టౌన్ ప్లానింగ్ విభాగము నందు సంప్రదించి తెలుసుకొన వలసినదిగా ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కమీషనర్, కడప నగరపాలక సంస్థ

భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించాలి : జేసీ


చెన్నారెడ్డిపేట వద్ద రైతులతో మాట్లాడుతున్న జేసీ అదితిసింగ్

పోరుమామిళ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అమరావతి-బెంగుళూరు జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని జాయింటు కలెక్టరు అదితిసింగ్ అధికారులను ఆదేశిం చారు. బుధవారం ఆమె పోరుమామిళ్ల మండలంలోని బొప్పాపురం, చెన్నారెడ్డిపేట, పేరమ్మగారిపల్లె, బ్రహ్మంగారిమఠం మండలంలోని ముదు మాల, వెంకటాపురం ప్రాంతాల్లో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను జేసీ దృష్టికి తీసుకెళ్లారు. కొందరు రైతులు ప్రభుత్వం అందించే నష్టపరిహారం తమకు సరిపోదని, మరింత పెం చాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూమి కోల్పోయిన అర్హులైన రైతుల వివరాలను సేకరించి నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రమోహన్, పోరుమామిళ్ల తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గండిలో టెండర్లు ఖరారు

చక్రాయపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవ స్థానంలో బుధవారం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో వివిధ రకాల వాటికి టెండర్లు, బహిరంగ వేలం నిర్వహించారు. దేవస్థానంలో నిర్వహించే వివాహాలు, ఇతర శుభ కార్యక్రమాలకు పందిళ్లు, ఎలక్ట్రికల్ డెకరే షన్లు, పూల డెకరేషన్లు, సామాన్లు సప్లై చేసుకునేందుకు ఏడాదికి వేంప ల్లెకు చెందిన సురేష్ బాబు రూ.1,01,116కు పాట దక్కించుకున్నారు. దేవస్థానం ఆవరణలో భక్తులు పాదరక్షలు భద్రపరచుకునేందుకు ఇడుపుల పాయకు చెందిన వెంకటా చలపతి రూ.45వేలకు వేలం దక్కించుకున్నారు. స్వామివారి అలంకరణకు గ్రామోత్సవానికి పూలు, పూలమాలలు టెండర్ నిర్వహించగా.. ముగ్గురు పోటీపడి టెండర్లు వేశారు. అనివార్య కారణాలతో టెండర్లను రద్దు చేసి వాయిదా వేశారు. నిత్యాన్నదాన పథకానికి అరటి ఆకులు సప్లై చేసేం దుకు, దేవాలయంలో పర్వదినాల్లో మామిడి, అరటి తోరణాలు సరఫరా చేసేం దుకు తదితర పాట దక్కించుకున్నారు. కడప దేవదాయ ధర్మాదాయశాఖ జూనియర్ అసిస్టెంట్ విజయభారతి, ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, దేవస్థాన ప్రధాన అర్చకులు కేసరి, బ్యాంకు అధికారులు, పోలీసులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మంగారి హుండీ ఆదాయం రూ.23లక్షలు

బ్రహ్మంగారిమఠం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్రస్వామి ఆల యంలో బుధవారం హుండీలను లెక్కించగా రూ.23,04,108 ఆదాయం వచ్చి నట్లు దేవదాయశాఖ సహాయ కమిషనర్ మల్లిఖార్జున ప్రసాద్, దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ తెలిపారు. గత మూడు నెలల కాలంలో భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను పూర్వపు మఠాధిపతి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో లెక్కించగా రూ.23,04,108 నగదు, 8 గ్రాముల బంగారు, 280 గ్రాములు వెండి వచ్చినట్లు తెలిపారు.

నిబంధనలు పాటించని మద్యం దుకాణాల లైసెన్సు రద్దు

● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్

ప్రొద్దుటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటి ంచని మద్యం దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని.. బెల్టు షాపులను ఉపేక్షించమని ఉమ్మడి కడప జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ హెచ్చరించారు. బుధవారం ఆయన ప్రొద్దు టూరు విచ్చేశారు. లింగాపురం వద్ద వున్న లిక్కర్‌డిపోను పరిశీలించి సరుకుల నిల్వలపై ఆరా తీశారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయాన్ని విజిట్ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మద్యం షాపుల్లో అక్కడే తాగడానికి అనుమతి లేదని.. అలా తాపే మద్యం దుకాణాలపై చర్యలు తప్పవన్నారు. బెల్టు షాపులపై నిరంతర నిఘా పెట్టామన్నారు. ఇప్పటికే జిల్లాలో అనేక ప్రాంతాల్లో కేసులు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా కొందరు మద్యం దుకాణాల నిర్వాహకులు డిపో మేనేజర్‌పై ఫిర్యాదు చేశారు. డిపో మేనేజర్ కొందరికి ఎక్కువ సరుకును ఇస్తూ మరికొందరికి తక్కువ సరుకు ఇస్తున్నాడని ఆరోపించారు. దీనిపై డిప్యూటి కమిషనర్ స్పందిస్తూ మద్యం తక్కువ ఎక్కువ ఇవ్వరాదని.. అందరికి సమానంగా మద్యం సరఫరా చేస్తారని తెలిపారు.


లిక్కర్ గౌడౌన్‌లో స్టాకును పరిశీలిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

అక్రమ మద్యం, నాటుసారా తయారీ, అమ్మకంపై నిరంతర దాడులు

పులివెందుల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమ మద్యం, నాటుసారా తయారీ, అమ్మకంపై నిరంతర దాడులు కొనసాగిస్తామని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి (డీపీఈఓ) ఎస్.రవికుమార్ అన్నారు. బుధవారం పులివెందుల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చక్రాయపేట మండలం కల్లూరుపల్లె తండా లో ఎక్సైజ్ అధికారులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పాత నేరు స్తులు, అనుమానితులు, గ్రామస్తుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. నాటుసారాతో కలిగే దుష్ప్రభావాలు, పౌరుల భవిష్యత్తుపై ఎలా ప్రభావం చూపుతుందో వివరించారు. నేరస్తు లు, అనుమానితులను బైండోవర్ చేసి నాటుసారా నిర్మూలిస్తా మని తెలిపారు. పులివెందుల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చెన్నారెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, చక్రాయపేట ఎస్ఐ కృష్ణ య్య, సిబ్బంది పాల్గొన్నారు.


కల్లూరుపల్లెలో కార్డన్ సెర్చ్ చేస్తున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి : కలెక్టర్

కడప కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధికారులు, అనుబంధ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ చెరు కూరి శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని గ్రీవెన్స్‌హాల్లో బుధవారం వైద్యులతో కలెక్టర్ సమీక్షిస్తూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని... ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేయాలన్నారు. జిల్లాలోని 51 ప్రాథమిక ఆసు పత్రుల్లో వైద్యాధికారులు రాబోయే మూడు నెలలకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. వచ్చే సమావేశంలో పీపీటీ ప్రజెంటేషన్ ఇవ్వాలన్నారు. ప్రైమరీ హెల్త్ సెంటర్ ప్రస్తుత స్టేటస్, ఓపీ, ఐపీ, డెలివరీ, ఇమ్యూనైజేషన్ వంటి రోజు వారి డేటాను పొందుపరచాలన్నారు. వైద్యాధికారులు లక్ష్యాలను సాధించేందుకు కష్టపడి పని చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అన్ని ప్రాథమిక, అర్బన్ హెల్త్ సెంటర్లలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించిందని.. అధికారులు నిబద్ధతతో పనిచే యాలన్నారు. వైద్యాధికారులు పనిచేసే ప్రాంతాల్లో నివాసాలు ఉండాలని ఆదేశించారు. మాతాశిశు మరణాల సంఖ్యను తగ్గించ డం, 104 వాహనాల షెడ్యూల్, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు, తదితర ఆరోగ్య సేవలపై అధికారులకు సూచనలు జారీ చేశారు. ఐపీ, ఓపీ, ల్యాబ్, డెలివరీ వంటి ఆరోగ్య సేవల్లో రాష్ట్ర స్థాయిలో 'ఏ' గ్రేడ్ ర్యాంకింగ్‌లో జిల్లా రెండో స్థానంలో నిలిచిందన్నారు. ప్రతిభ చూపుతున్న వైద్యాధికారులను కలెక్టర్ అభినందించారు. డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ నాగరాజు, డీఐఓ హిమదేవి, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ బాలాంజనేయులు, వైద్యాధికా రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

పీజీఆర్ఎస్ నిర్వహణపై కలెక్టర్ సమీక్ష

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించడం, ప్రజలకు అర్జీల అవసరం రాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరే ట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక, కంట్రోల్ రూమ్ అనుబంధ అధికారులతో సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, జడ్పీ సీఈఓ ఓబులమ్మ, కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, కేఎంసీ కమి షనరు మనోజ్‌రెడ్డి, కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జి సురేష్ కుమార్, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

గొంతుకోసుకుని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం



కమలాపురం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని బాలికల గురుకుల పాఠశాలలో జూనియర్ ఇంటర్ విద్యార్థిని కౌసల్య తరగతి గదిలో గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నిం చింది. గమనించిన ఉపాధ్యాయులు వెంటనే చికిత్స నిమిత్తం స్థాని క ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రిన్సిపాల్ తులశమ్మ సమాచా రం మేరకు.. బుధవారం మధ్యాహ్నం తోటి విద్యార్థినులతో కలిసి భోజనం చేసేందుకు కౌసల్య డైనింగ్ హాలుకు వెళ్లింది. భోజనం చేయకుండానే వెనుదిరిగి తరగతి గదికి వెళ్లి చిన్న అద్దాన్ని పగల గొట్టుకుని ఆముక్కతో గొంతు కోసుకుని స్పృహ తప్పి పడిపో యింది. వెంటనే ఉపాధ్యాయులు గమనిండంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని తెలిపారు. విద్యార్థినిది రాజంపేట అని ఆమె తలి దండ్రులు కువైట్‌లో ఉన్నారన్నారు. విద్యార్థినికి చదువు మీద ఆసక్తి లేదని.. ఇటీవల ఆమె నానమ్మ పాఠశాలలో వదిలి వెళ్లడం తో ఇలా చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నామన్నారు. ఈ విష యంపై విద్యార్థిని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. ఎలాంటి ప్రాణహాని లేదని వైద్యులు తెలిపారని ప్రిన్సి పాల్ పేర్కొన్నారు. కాగా, విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

ఘర్షణలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

● ఇద్దరు నిందితుల అరెస్ట్

బద్వేలుటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఘర్ష ణలో గాయపడ్డ మృతికి కారణమైన ఇద్దరు నింది తులను అరెస్ట్ చేసినట్లు సీఐ రాజగోపాల్ తెలిపారు. నెల్లూరు జిల్లా మర్రి పాడు మండలం చాబోలు గ్రామానికి చెందిన మంచాల వెంక టయ్య(38)పై గొడుగునూరు క్రిష్ణ, చెప్పలి దినేష్ అనే ఇరు వురు రెండు నెలలక్రితం దాడి చేయడంతో చికిత్స పొందు తూ మృతి చెందాడు. ఈ క్రమంలో నిందితులను బుధవారం బద్వేలు ఆర్టీసీ బస్టాండు వద్ద అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు. మృతుడు వెంకటయ్య చెల్లెలు, భర్త గొడుగునూరు క్రిష్ణలు కుటుంబకలహాలతో విడిపో యారు. ఈ క్రమంలో రెండవ నిందితుడు అయిన చెప్పలి దినేష్ తన అమ్మతో వెంకటయ్య చనువుగా ఉన్నాడనే అను మానంతో సహించలేకపోయాడు. ఈనేపథ్యంలో పథకం ప్రకారం గొడుగునూరు క్రిష్ణ, చెప్పలి దినేష్‌లు ఆగస్టు 13వ తేదీ అబుసాయిపేట గ్రామంలో కత్తితో దాడి చేయడంతో వెంకటయ్యకు గాయాల య్యాయి. వెంకటయ్యను వెంటనే కడప, నెల్లూరు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. అతని చనిపోవడానికి కారణమైన గొడుగునూరు క్రిష్ణ, చెప్పలి దినేష్‌లను బుధవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

వైసీపీ నేతపై చీటింగ్ కేసు నమోదు

కడప క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ప్రైవేటు కాలేజీ విక్రయానికి సంబంధించి రూ.30లక్షలు తీసు కుని మోసం చేసిన వైసీపీ నేతపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. వైసీపీ నేత సుభాన్‌బాషా కడపకు చెందిన డాక్టర్ నజీము ద్దీన్‌కు వికాస్ కళాశాలను విక్రయిస్తున్నట్లు అగ్రిమెంటు రాసి చ్చాడు. ఆసమయంలో నజీముద్దీన్ నుంచి రూ.30లక్షలు తీసుకున్నాడు. ఆ తర్వాత కళాశాలకు యూనివర్శిటీ అను మతి లేదని తెలిసి.. నజీముద్దీన్ తమ డబ్బులు వెనక్కు ఇవ్వాలని కోరాడు. అయితే సుభాన్‌బాషా డబ్బులు ఇవ్వక పోవగా.. బెదిరించడంతో నజీముద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు సుభాన్‌బాషాపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



బ్రహ్మంగారిమఠం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాణిబావి సమీ పంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. బి.కో డూరు మండలం తుమ్మల పల్లెకు చెందిన ఎ.నారాయణ, తన బంధువు పరమేశ్వర రోజువారి పనుల నిమిత్తం మైదుకూరు పట్ట ణానికి వెళ్లారు. పనులు ముగించుకుని ద్విచక్రవాహనంలో స్వగ్రా మానికి వస్తుండగా రాణిబావి సమీపంలోని టోల్‌గేటు దగ్గర ఎదు రుగా వస్తున్న లారీని అదుపు తప్పి ఢీకొన్నారు. దీంతో నారాయణ (52) అక్కడికక్కడే మృతి చెందాడు. పరమేశ్వర్‌కు తీవ్రగా యాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం కడపలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి బ్రహ్మ ంగారిమఠం ఎస్ఐ చంద్రశేఖర్ చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



కల్యాణ వేదికపై ఆసీనులైన సీతారాములు

సుండుపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ కందులవారిపల్లెలో నిర్మించిన ఆలయంలో బుధవారం సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అభిషేకం, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యంకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఉదయం 11 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహించారు. అన్నదానం చేశారు. ఎంపీపీ రాజమ్మ, టీడీపీ, జనసేన నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు హాజరయ్యారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

వీరబల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దివీడు కొత్తపల్లిలోని రామాలయంలో బుధవారం సీతారాముల విగ్రహాలతోపాటు, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం సీతారాముల కల్యాణం నిర్వహించారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం, టీడీపీ మండల నాయకులు శ్రీధర్‌రెడ్డి, సురేంద్రారెడ్డి, వంగిమళ్ల మధుసూదన్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి, ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, వైసీపీ నాయకులు వీరనాగిరెడ్డి, మదన్‌రెడ్డి, వీఆర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డీస్‌కాలనీలో..

రాయచోటిటౌన్: పట్టణంలోని రెడ్డీస్ కాలనీలోని రామాంజనేయస్వామి పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. వరగంరెడ్డి లక్ష్మి అరుణకుమారి, వరగంరెడ్డి హరినాథ్‌రెడ్డి, శ్రీలక్ష్మి, సాయిచందర్‌రెడ్డి, అచ్చమ్మ కుటుంబ సభ్యులతో పాటు సాయిరాం, రేవతి దంపతుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు షేక్. హుస్సేన్‌పీరా దంపతులు అన్నదానం చేశారు ఆలయ కమిటీ నిర్వాహకులు కావలి వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం

సుండుపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి గ్రామ పంచాయతీ కొండల తూర్పులో నిర్మిస్తున్న రామాలయానికి బుధవారం రూ. లక్ష విరాళం ఇచ్చినట్టు మండల వైసీపీ మాజీ అధ్యక్షుడు యర్రపురెడ్డి ఆనందరెడ్డి తెలిపారు. ఆలయ నిర్మాణంతో ఊరికి మంచి జరుగుతుందని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు అందరికీ అందాలి

రాజంపేట టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు ప్రతి కుటుంబానికి అందాలని జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. బుధవారం బ్యాంకు అనుబంధ శాఖల అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసురక్ష పథకంలో భాగంగా 18 నుంచి 70 ఏళ్ల లోపు ఉన్న ప్రతి వ్యక్తి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమాయోజన పథకాల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రతి గ్రామ బ్యాంకు, ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ఆయా పథకాలకు పేర్లు నమోదు చేస్తామన్నారు. కౌలు రైతులు పంట బీమా చేసుకోవాలని జేడీఏ చంద్రానాయక్ కోరారు. ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి నాగార్జున మాట్లాడుతూ ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజంపేట, కోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు, నందలూరు మండలాల బ్యాంకు అధికారులు, ఏపీఎంలు, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు గ్రహణం!

- అభివృద్ధికి నోచుకోని రహదారి
- వాహనదారులకు ఇబ్బందులు



విస్తరణకు నోచుకోని రోడ్డులో వెళుతున్న వాహనాలు

సిద్దవటం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనులు ఏళ్ల తరబడి సాగుతూనే ఉండడంతో సిద్దవటం మండల కేంద్రంలోని ప్రజలతోపాటు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కడప నుంచి రాష్ట్ర రాజధాని అమరావతితోపాటు, విజయవాడ, నెల్లూరు, కాకినాడ, మచిలీపట్నం తదితర ప్రాంతాలకు వాహనాలు రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ఈ మార్గం ఆయా ప్రాంతాలకు షార్ట్‌కట్ కావడంతో వాహనాల రద్దీ కూడా అధికంగా ఉంటుంది. సిద్దవటం మండల కేంద్రంలో ఈ మార్గం ఇరుకుగా ఉండడంతో వాహనదారులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో 2010లో అప్పటి ప్రభుత్వం ఈ రోడ్డును 60 అడుగులకు విస్తరించేందుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా అధికారులు రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ కూడా వేశారు. అయితే, ప్రజా ప్రతినిధులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో రోడ్డు వెడల్పును 50 అడుగులకు కుదించారు. విస్తరణలో గృహాలు కోల్పోయే 80 శాతం మందికి 2013లో పరిహారం పంపిణీ చేశారు. దీంతో కొందరు స్వచ్ఛందంగా తమ ఇళ్లను తొలగించుకోగా, మరికొందరు అలాగే ఉంచుకున్నారు. మిగిలిన వారికి పరిహారం చెల్లించేందుకు సుమారు రూ.50 లక్షలతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. నేటికీ ఆ నిధులు మంజూరు కాలేదు. కాగా, రహదారి అభివృద్ధి పనులకు నాలుగేళ్ల క్రితం రూ.36 లక్షలు మంజూరయ్యాయి. సిద్దవటంలోని ఎగువపేట, పోలీసు క్రాస్‌రోడ్ సమీపంలో పనులు ప్రారంభించారు. కొంతవరకు పనులు చేసిన కాంట్రాక్టర్ ఆ తర్వాత నిలిపివేశారు. అప్పటి నుంచి ఈ రహదారి పనులకు గ్రహణం పట్టింది. ఈ మధ్య కాలంలో ఈ మార్గంలో వాహనాల రద్దీ మరింత పెరగడం, మండల కేంద్రంలో రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహన చోదకులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఇదే అదనుగా ఎగువపేట, దిగువపేట ప్రాంతాల్లో కొందరు హద్దులు దాటి రహదారిని ఆక్రమించి మళ్లీ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని రహదారి విస్తరణ పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

పనులు ప్రారంభించాలి



గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రోడ్డు విస్తరణ పనులు జరగలేదు. షార్ట్‌కట్ అమరావతికి వెళ్లేందుకు ఉపయోగపడే ఈ రహదారి పనులపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

\- మల్లు వెంకటసుబ్బారెడ్డి, మాచుపల్లె

రహదారిని అభివృద్ధి చేయాలి



రహదారిని వెంటనే అభివృద్ధి చేయాలి. రోడ్డు వెడల్పు లేని కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలేవైనా ఉంటే వెంటనే పరిష్కరించి ప్రయాణికులకు ఇబ్బందిలేకుండా చూడాలి.

\- ఎ.చిన్నవెంకటయ్య, ఆకులవీధి

గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- ఆర్డీవో శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

రాయచోటిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ లింగ నిర్ధారణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయి సలహా, అథారిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయచోటి డివిజన్‌లోని స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు గర్భస్థ లింగ నిర్ధారణ నిషేద చట్టాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితిలో లింగ నిర్ధారణ చేయరాదని, స్కానింగ్ యంత్రాలు ఉపయోగించే వైద్యుల వివరాలు, అథారిటీ వారు జారీ చేసిన సర్టిఫికెట్‌తో సరిపోవాలన్నారు. అనుమతులు లేని స్కానింగ్ సెంటర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. స్కానింగ్ వివరాలను ఫారం-ఎఫ్‌లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇచ్చట లింగ నిర్ధారణ పరీక్షలు చేయం అని స్కాన్ సెంటర్స్‌లో ఐఈసీ ప్రదర్శించాలన్నారు. ప్రతి స్కాన్ సెంటర్, హాస్పిటల్‌లో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలన్నారు. ముందు కాన్పులలో ఆడపిల్లలు ఉన్న గర్భిణులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. 4వ నెల తరువాత జరిగిన అబార్షన్ కేసులకు ఆడిట్ చేసి రిపోర్టు సబ్మిట్ చేయాలన్నారు. అబార్షన్ కోసం వాడే పిల్స్ డాక్టర్ సిఫారసు లేకుండానే అందుబాటులో ఉన్నాయని, దీనిపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లింగ నిర్ధారణ నిషేధ చట్టం నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉషశ్రీ, ప్రోగ్రాం ఆఫీసర్ దేవశిరోమణి, చిన్నపిల్లల వైద్యులు నిసార్ అహ్మద్, స్త్రీ వైద్యులు నీలోఫర్ బేగం, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జయరాముడు, ఐసీడీఎస్ వినోద్‌కుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సురేంద్రరెడ్డి, నాగేశ్వరయ్య, ఫరీదాబేగం, సీహెచ్‌వో నారాయణ, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరించాలి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

వీరబల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అన్నిశాఖల అధికారులు పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పిలుపునిచ్చారు. వీరబల్లి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యులు సూచించన సమస్యలను అధికారులు తక్షణం పరిష్కరించాలన్నారు. రోళ్లమడుగు పథకం సక్రమంగా నిర్వహించి అందరికీ తాగునీరు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇక్బాల్‌కు సూచించారు. పని అవసరమైన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని సూచించారు. ఈ సందర్భం గా తాటిగుంటపల్లి సర్పంచ్ గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సీసీ రోడ్ల పనులకు తీర్మానం చేసి తాము పంపిన జాబితాకు బదులుగా అధికారులు మరో జాబితా ఎలా పంపుతారని ప్రశ్నించారు. పలువురు సభ్యులు విద్యుత్ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధికారులు, ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీవో నూర్జహాన్

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు

నందలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రకృ తి సేద్యం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకుని భూసారం పెంచుకోవడం తోపాటు మంచి దిగుబ డులను పొందవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ తెలిపారు. మండలంలోని లేబాక మంగ మాంబపురం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏడీఏ బి.రమేష్‌బాబు మాట్లాడుతూ సబ్సిడీపై ట్రైకోడెర్మా విరిడీ లభిస్తోందని, కడప కృషి విజ్ఞాన కేంద్రంలో కొత్త రకం నువ్వులు లభిస్తాయని తెలిపారు. ఉద్యాన అధికారి జి.సురేష్‌బాబు మాట్లాడుతూ మామిడిలో సమగ్ర సస్యరక్షణ విధానం వివరించారు. మామిడిలో తేనెమంచు పురుగు నివారణ తదితర చర్యలను వివరించారు. మండల వ్యవసాయాధికారి జి.మల్లికార్జున, జడ్పీఎన్ఎఫ్ సిబ్బంది ద్రవ జీవామృతం, బీజామృతం తయారీ విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులు పరిష్కరించండి

నందలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్ కేసులు పరిష్కారానికి కృషి చేయాలని జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జె.నందిని సూచించారు. నందలూరు కోర్టు పరిధిలోని పోలీసు అధికారులతో బుధవారం జడ్జి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు ప్రీ-లోక్‌అదాలత్ సిట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, నందలూరు, పెనగలూరు ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, పి.రవిప్రకాష్‌రెడ్డి, పుల్లంపేట ఏఎస్‌ఐ పిచ్చయ్య, రాజంపేట ఎక్సైజ్ ఎస్‌ఐ సుధాకర్, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించండి

సంబేపల్లె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ భక్తవత్సలం తెలిపారు. బుధవారం పోలీసు సిబ్బందితో కలసి ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. రికార్డులు సరిగ్గా లేని వాహనాలకు, హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించారు. ఫోర్ వీలర్ వాహనదారులు సీట్ బెల్ట్‌లను, టూవీలర్ వారు హెల్మెట్లను తప్పనిసరిగా ధరించాలన్నారు. వాహనదారులు రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడప రాదన్నారు. భద్రతా నియమాలు పాటించడం వల్ల ప్రమాదాలను అరికట్టవచ్చునన్నారు.

మండల అభివృద్ధే మంత్రి ధ్యేయం



మాట్లాడుతున్న మదన్‌మోహన్

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 20 (ఆంధ్యజ్యోతి):మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి ధ్యేయమని మండల యువ నాయకుడు యనమలమదన్‌మోహన్ తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎర్రగుడి, పాళెం గొల్లపల్లె, లక్కిరెడ్డిపల్లె గ్రామాల ప్రజలతో టీడీపీ సభ్యత్వాలు నమోదు చేయించారు.. ఈ కార్యక్రమంలో రాజంపేట డాక్టర్స్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీ నాయక్, ముక్తార్ అహ్మద్, హేమంత్, మల్లికార్జున, అన్వర్, హరికృష్ణ, మసూద్, తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లెలో టీడీపీ సభ్యత్వాలు నమోదు

సుండుపల్లె, నవంబరు20(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు టీడీపీ సభ్యత్వం ఎంతో కీలకమని టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాం నాయుడు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో సుమారు 200 సభ్యత్వాలు చేసినట్లు తెలిపారు.

చేనేత సొసైటీ పనుల పరిశీలన

సిద్దవటం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరం-1 ఎస్‌కేఆర్ నగర్‌లో చేనేత సొసైటీ పనులను హౌసింగ్ పీడీ రాజరత్నం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బద్వేలుకు చెందిన ఓబుల్‌రెడ్డి రూ. 49 లక్షలకు పనులు దక్కించుకున్నారని, క్లస్టర్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణ పనులు, టాయిలెట్ గదులు, మెయింటెనెన్స్ పనులు పూర్తి చేయాలని తెలిపారు. నాసిరకంగా పనులు చేస్తే బిల్లులు ఆపివేస్తామని హెచ్చరించారు. స్థానిక కమిటీ సభ్యులు గంజి సుబ్బరాయుడు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్లు చేనేత సొసైటీ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతోపాటు, ఎలాంటి కొలతలు లేకుండా పనులు చేస్తున్నారని, దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన ప్రహరీ గోడను కూల్చిన వారిని శిక్షించాలి

పుల్లంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హిందూ శ్మశానవాటిక ప్రహరీ గోడను రాత్రికి రాత్రి కూల్చిన వారిని శిక్షించాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన బీజేపీ నాయకులతో కలిసి గోడ కూల్చివేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన ఈ సంఘటనను కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. హిందూ ఆలయాలు, శ్మశానవాటిక భూముల అన్యాక్రాంతం వంటి చర్యలను బీజేపీ ఖండిస్తుందన్నారు. అనంతరం ఆయన పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, ఇదే విషయంపై కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు గోశాలదేవి, ఎస్సీ సెల్ నాయకుడు శాంతయ్య తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారు అరవింద కిషోర్‌కు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, రైల్వేకోడూరు బీజేపీ ఇన్‌చార్జి చెంగల్‌రాజు, ఉపాధ్యక్షుడు సురేష్‌రాజు, తదితరులు పాల్గొన్నారు. కాగా, శ్మశానంగా వినియోగిస్తున్న సర్వే నంబరు 280లో ఎవరికీ పట్టాలు ఇవ్వలేదని తహసీల్దారు అరవింద కిషోర్ తెలిపారు. ఈ సర్వే నెంబరులోని 6.20 ఎకరాల భూమి ఆర్ఎస్ఆర్‌లోను, అడంగల్‌లోను తోపు పోరంబోకుగా నమోదైందన్నారు. రికార్డులు లేకుండా ఆన్‌లైన్‌లో చేరిన వివరాలను తొలగించేందుకు జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపామన్నారు.

జగనన్న కాలనీ సమస్యలపై పోరాటం

సిద్దవటం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగనన్న కాలనీవాసుల సమస్యలపై పోరాడుతామని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు కోటపాటి సుబ్బమ్మ మండిపడ్డారు. ఉప్పరపల్లెలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని జగనన్న కాలనీలో మౌలిక వసతులు, డ్రైనేజీ, రోడ్లు, విద్యుద్దీపాలు లేక అవస్థలు పడుతున్నారని, కొంతమంది బినామీ పేర్లతో స్థలాలు తీసుకున్నారని మండిపడ్డారు. మండల పరిధిలోని జగనన్న కాలనీపై సమగ్ర విచారణ చేయాలని జిల్లా సర్వోన్నతాధికారికి నివేదిక సమర్పిస్తామన్నారు.

పక్కా గృహాల నిర్మాణాలు పూర్తి చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ సాంబశివయ్య

రామాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వివిధ దశల్లో ఆగిపోయిన పక్కా గృహాల నిర్మాణాలు డిసెంబరు చివరి నాటికి పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ సాంబ శివయ్య తెలిపారు. మండలంలోని నల్లగుట్టపల్లి హౌసింగ్ లేఅవుట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మంజూరైన పక్కా గృహాలు ఎల్ఎల్, బీబీఎల్, ఎల్ఆర్ఎల్, ఆర్సీ స్థాయిలో ఆగిపోయిన పక్కా గృహాలు డిసెంబరు చివరి నాటికి పూర్తి చేసుకుంటే బిల్లులు చెల్లిస్తామన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ, సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సిద్దవటం : మండలంలోని ఉప్పరపల్లెలో కడప జిల్లా హౌసింగ్ పీడీ రాజరత్నం లబ్ధిదారులతో సమావేశమయ్యారు. మార్చి లోగా నిర్మాణం పూర్తి చేయకపోతే, బిల్లులు మంజూరు కావని హెచ్చరించారు. హౌసింగ్ ఏఈ చెన్నయ్య, సర్పంచ్ బాలాజీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుబ్బరాయుడు, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ సునీత, గృహనిర్మాణవాసులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతుల తనిఖీ



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో చర్చించుకునే అంశాలను తరగతి గదుల్లో అమల్లోకి తీసుకొచ్చి మెరుగైన విద్య అందించాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పాలెంరాజా, ఉపాధ్యాయురాలు ప్రేమరాణి పాల్గొన్నారు.

యానిమేటర్ల తొలగింపు చర్యలు ఆపాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వీవోఏలు

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వీవోఏ, యానిమేటర్ల తొలగింపులు ఆపాలని, ఇప్పటికే తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రామాంజులు డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ప్రతినిధులు కలెక్టర్ కార్యాలయం ఎదుట మోకాళ్ల మీద కూర్చుని నిరసన తెలిపారు. అనంతరం ఏవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పీలేరు, రాయచోటి, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో యానిమేటర్లపై రాజకీయ వేధింపులు పెరిగిపోయాయన్నారు. కనీస పద్ధతులు పాటించకుండా వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తుంటే సెర్ప్, డీఆర్‌డీఏ అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారన్నారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. అరియర్స్ చెల్లించాలన్నారు. ఏపీ వెలుగు యానిమేటర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు రాణెమ్మ, ప్రధాన కార్యదర్శి జి. రెడ్డెప్ప, కోశాధికారి సుబ్రమణ్యం, నాయకులు రమణారెడ్డి, శ్వేత, సుమతి, రెడ్డిరాణి, నిర్మల, రాజగోపాల్, నాగసుబ్బయ్య, శ్రీరామ్‌రెడ్డి, పవన్, వీవోఏలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు కార్మిక యూనియన్ నేతలు

రాయచోటిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరుతూబుధవారం సీఐటీయూ, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో ఏళ్ల తరబడి చాలీచాలని వేత నాలతో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. 2022 పీఆర్‌సీ ప్రకారం వేతనాలతో పాటు, అరియర్స్ కూ డా చెల్లించాలని కోరారు. ఈ నెల 22న జరిగే హెచ్‌ఆర్ కమిటీ సమావేశంలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై చర్చించి కార్మికులకు తగిన న్యాయం చే యాలని డిమాండ్ చేశారు. యూఈసీడబ్ల్యుఈ (డిస్కం) అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు, యూఈఈయూ ప్రధాన కార్యదర్శి ఏవీ రమణ, యూఈసీడబ్ల్యుయూ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్‌గౌడ్, శ్రీనివాసులురెడ్డి, నాయుడు, రామాంజుల్‌రెడ్డి, గజేంద్రవర్మ, పెద్దిరెడ్డి, వి విజన్ నాయకులు, కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందించాలి

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన ప్రతి రైతుకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించాలని జిల్లా ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, సీపీఐ కార్యదర్శి పీఎల్ నరసింహులు బుధవారం కలెక్టర్ ఆఫీసు ఏవో నాగభూషణంకు వినతిపత్రం సమర్పించారు. వెలిగల్లు ప్రాజెక్టుకు హంద్రీ-నీవా నీరు వదలాలని, కాలువల పనులు పూర్తి చేసి నీరు వదలాలని వారు డిమాండ్ చేశారు. పింఛా డ్యాం పునరుద్ధరించి రైతులను ఆదుకోవాలని వినతిపత్రంలో కోరారు.

రోడ్డు మరమ్మతులకు చర్యలు

సుండుపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రోడ్లు గుంతలమయం కావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని సోమవారం స్పందన కార్యక్రమంలో బీజేపీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించడంతో బుధవారం ఆర్అండ్‌బీ ఈఈ సహదేవరెడ్డి, ఏఈ కుమార్‌బాబు రోడ్డును పరిశీలించారు. గుల్లావాండ్లపల్లె సమీపంలోని గుంతలను తక్షణమే పూడ్చివేస్తామని తెలిపారు. రాయచోటి- సుండుపల్లె డబుల్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివరాంనాయుడు, సురేశ్‌నాయుడు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్ తదితరులు పాల్గొన్నారు.


పశువుల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సుండుపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పశువులకు సంక్రమించే వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పశు వైద్యశాఖ సిబ్బందిని సంప్రదించి అవసరమైన టీకాలు వేయించాలని పశు సంవర్ధకశాఖ జిలాంల అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై సూచించారు. బుధవారం మడితాడు పంచాయతీ కువరపల్లెలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 658 గొర్రెలకు నట్టల నివారణ మందులు, 54 ఆవులు, 12 గేదెలకు గర్భకోశ నివారణ చికిత్సలు, 36 దూడలకు బ్రూసెలోసిస్ వ్యాధి నివారణ టీకాలు అందించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఉపసంచాలకులు డాక్టర్ మాలకొండయ్య, కడప అదనపు ఈవో డాక్టర్ రమేశ్, అనంతపురం డీఎల్‌డీ ఏఈవో డాక్టర్ సుధాకర్, కడప వీపీసీ డీడీ డాక్టర్ రంగస్వామి, కడప డీఎల్‌డీఏ పీడీ డాక్టర్ రాజశేఖర్, సుండుపల్లె ఏడీఏ విజయకుమార్, సంబేపల్లె ఏడీ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, రవికుమార్, కడప డాక్టర్ శివరామిరెడ్డి, చిన్నమండెం డాక్టర్ గణేశ్, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, మండల పశు సంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార ఉద్యోగులపై వేటుకు రంగం సిద్ధం!


ఓబులవారిపల్లె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎండీసీ పరిధిలో అనధికారికంగా ఉద్యోగాలు పొందినవారిని సాగనంపేందుకు హెడ్ ఆఫీసులో అస్త్రాలు సిద్ధం చేస్తున్నారని, మొదటి విడతలో ఇలాంటి వారిని సుమారు 123 మందిని గుర్తించినట్లు, మరో వంద మంది దాకా ఉన్నట్లు సమాచారం. దీంతో మంగంపేట బాధితులు తమ ఉద్యోగాలకు ఎక్కడ ఇబ్బంది కలుగుతుందోనని ఆందోళన చెందుతుండడంతో కార్మిక వర్గాల నాయకులు ఆందోళనలు చేయడానికి సిద్ధమవుతుండగా, కొందరు నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు.

లంకమల అందాలు చూడతరమా...



లంకమల అభయారణ్యంలో కనువిందు చేస్తున్న జలపాతం


- గలగల పారే సెలయేరు - బండరాళ్లపైనే అందమైన చెట్లు
- అబ్బురపరుస్తున్న పచ్చని కొండలు

రాజంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నియోజకవర్గంలోని సిద్దవటం పరిధిలోని లంకమల అభయారణ్యం చూపరులను కట్టిపడేస్తోంది. మండల కేంద్రానికి కేవలం 8 కిలోమీటర్ల దూరంలో లంకమల అడవుల్లో నిత్యపూజకోన ఉంది. కార్తీక మాసం సందర్భంగా కడప, నెల్లూరు, అన్నమయ్య జిల్లావాసులు వేలాదిమంది ఈ అభయారణ్యానికి వచ్చి నిత్యపూజకోనను సందర్శిస్తుంటారు. నిత్యపూజకోనకు ఎంతో భక్తిగా వెళ్లే భక్తులు అభయారణ్యంలోని అందాలను ఆస్వాదిస్తున్నారు. 4 కిలోమీటర్ల మేర నడిచివెళ్లే ఈ మార్గంలో పెద్ద పెద్ద బండరాళ్లు, ఎత్తయిన కొండలు పచ్చదనం పరుచుకున్న గుట్టలు, లోయలు, భారీ వృక్షాలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. భారీ వర్షాలు లేనప్పటికీ ఒక మోస్తరు వర్షం వల్ల నిత్యపూజకోన వద్ద గుండంలో పైనుంచి జలపాతంలా నీరు పడుతూ ఎంతో ఆకట్టుకుంటోంది. దారి వెంబడి చెట్ల వేర్లు ఊయల రూపంలో మారి అందరినీ కట్టిపడేస్తున్నాయి. కొండలపై ఉన్న బండరాళ్లు ఒక్కొక్కటి ఒక్కో ఆకృతిలో ఉంటూ చూడముచ్చటగొలుపుతున్నాయి. నిత్యపూజకోనకు వెళ్లే వేలాదిమంది భక్తులు ఇక్కడ అడవితల్లి అందాలను చూసి ఒకవైపు భక్తిభావంతో, మరోవైపు ప్రకృతి అందాలను చూసి తన్మయత్వం చెందుతున్నారు.


పచ్చదనంతో చూపరులను కట్టిపడేస్తున్న లంకమల అభయారణ్యం


రాళ్లను దాటుకుంటూ నిత్యపూజకోనకు వెళుతున్న భక్తులు


ఓ వైపు పచ్చదనం.. మరోవైపు మోడువారిన చెట్లు


లంకమలలో ఇలాంటి అందాలెన్నో...

ఆటోను ఢీకొన్న ఐచర్ వాహనం

- ఒకరి మృతి...
- 12 మందికి గాయాలు


ప్రమాద స్థలంలోనే మృతి చెందిన బాలక లక్ష్మీదేవి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చిన్నమండెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కూలీలతో వెళుతున్న ఆటోను ఐషర్ వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా 12 మందికి గాయాలయ్యాయి. ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు మండలంలోని కలిబండకు చెందిన 12 మంది కూలీలు బెస్తపల్లిలో కూలి పనులకు వెళ్లారు. పని పూర్తి చేసుకుని సాయంత్రం ఆటోలో స్వగ్రామానికి వెళుతుండగా బెస్తపల్లి క్రాస్ సమీపంలోని డాబా వద్ద మదనపల్లి వైపు వెళుతున్న ఐషర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలక లక్ష్మీదేవి (48) అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన 12 మందికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మృతి చెందిన లక్ష్మీదేవికి ఒక కుమారుడు ఉన్నాడు. భర్త దాదాపు పదేళ్ల క్రితం చనిపోయాడు. తమ గ్రామానికి చెందిన ఒకరు మృతి చెంది, 12 మంది గాయపడడంతో కలిబండలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులకు పరిహారం చెల్లించండి

రహదారిపై బాధితుల నిరసన


రోడ్డుపై నిరసన తెలుపుతున్న గ్రామస్థులు


బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దార్ తపశ్విని

కురబలకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి రోడ్ల విస్తరణకు సంబంధించి భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని భూబాధితులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అంగళ్లు పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూములు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించకపోవడంతో పనులను అడ్డుకుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ సర్వేనంబరు 130, 132లలో విలువైన భూములను కోల్పోయామని, దాదాపుగా పనులు పూర్తి కావస్తున్నా ఇప్పటి దాకా పరిహారం చెల్లించలేదన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా కాంట్రాక్టర్ సిబ్బంది తమపై కేసులు పెడుతామని బెదిరిస్తున్నట్లు పేర్కొన్నారు.

అనంతరం తహసీల్దార్ తపశ్విని అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడి వచ్చే నెలాఖరులోగా నష్టపరిహారం అందిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కాగా ముదివేడు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం, దిండుగల్లు జిల్లా, పెరియారుకోటకు చెందిన మారుముత్తు (33) మదనపల్లె పట్టణం దేవతానగర్‌లో కాపురం ఉంటున్నాడు. ఆదివారం సొంత పని నిమిత్తం వెళ్లి వస్తున్న అతను బైపాస్ వద్ద రోడ్డుప్రమాదంలో గాయపడ్డాడు. స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి వివాహమై ఆరునెలలు మాత్రమే అయింది. భార్య ఫిర్యాదు మేరకు మదనపల్లె తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రొద్దుటూరు ప్రభుత్వ ఖాజీగా ఆరిఫుల్లా

కలికిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు ప్రభుత్వ ఖాజీగా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన మహబూబ్‌బాషా కుమారుడు షేక్ ఆరిఫుల్లాను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ప్రొద్దుటూరుకు మరో ఖాజీ కొనసాగుతున్న నేపథ్యంలో పట్టణ అవసరాల రీత్యా మరో ఖాజీని నియమిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. కొత్తగా నియమితులైన ఆరిఫుల్లా పదేళ్లపాటు ఖాజీగా కొనసాగుతారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఖాజీగా బాధ్యతలు నిర్వహిస్తూ ముస్లిం వివాహాలను చట్టబద్ధంగా నిర్వహించాలని ప్రభుత్వం షరతులు విధించింది. చట్టాన్ని అతిక్రమించి వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని షరతు విధించారు.

భూమి కౌలుకు ఇస్తే కబ్జా చేశారు


వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్

రామసముద్రం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమి కౌలుకు ఇస్తే కబ్జా చేశారని ఓ బాధితురాలు వాపోయింది. ఆమె వివరాల మేరకు.. మండలంలోని నారిగానిపల్లె పంచాయతీ ఎర్రనేలపల్లె గ్రామానికి చెందిన లక్ష్మమ్మ భర్త వెంకటరమణరాజుకు సర్వే నెంబరు 218/1సీ1లో 2.75 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని ఇదే గ్రామానికి చెందిన సురేంద్రరాజుకు కౌలుకు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆ భూమికి సంబంధించి కౌలుదారుడు దొడ్డిదారిన పట్టా రూపొందించుకున్నట్లు ఆమె ఆరోపించింది. ఈ విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. దీనిపై స్పందించిన కలెక్టర్ లక్ష్మమ్మ భూమిని కబ్జాదారుల నుంచి విడిపించి బాధిత మహిళకు అప్పగించాలని తహసీల్దార్ నిర్మలాదేవికి ఆదేశాలిచ్చారు. దీంతో బుధవారం రెవెన్యూ, పోలీసు సిబ్బందితో తహసీల్దార్ భూమిని పరిశీలించి సర్వే చేశారు. కబ్జాదారుల నుంచి భూమిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. రికార్డులను తారుమారు చేసి భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నగల దుకాణాలపై అధికారుల దాడులు

- దుకాణాలలో బంగారు నిల్వలు.. అమ్మకాలపై రోజంతా తనిఖీలు
- అధికారుల రాకతో దుకాణాల మూత


బంగారు దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

బి.కొత్తకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణంలోని బంగారు దుకాణాలపై వాణిజ్య పన్నుల శాఖాధికారులు బుధవారం పెద్దఎత్తున దాడులు నిర్వహించారు. 15 మంది అధికారులు బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో 5 దుకాణాల్లోకి ప్రవేశించి ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. బుధవారం ఉదయం 11 నుంచి రాత్రి పొద్దుపోయే వరకు తనిఖీలు కొనసాగాయి. బి.కొత్తకోట పట్టణంలో దాదాపు 30 బంగారు దుకాణాలు ఉండగా, వీరు యూనియన్‌గా ఏర్పడి బంగారం కొనుగోలు, అమ్మకంపై తప్పుడు లెక్కలు చూపి ట్యాక్స్‌లు ఎగ్గొడుతున్నారని, నాణ్యతలేని బంగారాన్ని 22 క్యారెట్ బంగారం అని, హాల్‌మార్క్ అని కస్టమర్లను మోసగిస్తున్నారని, నగలు కొనుగోలు చేసిన వారికి తెల్లకాగితంలో జీఎస్టీ లేని బిల్లులు ఇష్టానుసారం వేసి, మోసగించి రూ.లక్షలు కొల్లగొడుతున్నారని ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ కేవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ రవిశంకర్, కడప, మదనపల్లె, రాయచోటి, పులివెందుల వాణిజ్యపన్నులశాఖ అసిస్టెంట్ కమిషనర్లు సునీత, మౌనిక, వరలక్ష్మి, జ్ఞానానందరెడ్డిలతో పాటు జీఎస్టీ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఎంపిక చేసుకున్న 5 దుకాణాలలోకి వెళ్లి రికార్డులను, బిల్లులను స్వాధీనం చేసుకున్నారు. బంగారు నిల్వలు, రోజువారీ వాస్తవ విక్రయాలు, బయటి నుంచి బంగారం కొనుగోళ్లపై ఆరా తీశారు. అధికారుల తనిఖీల సమాచారంతో పట్టణంలోని మదనపల్లె రోడ్డు, బెంగళూరు రోడ్డులోని పలు దుకాణాలు మూసివేసి యజమానులు జారుకున్నారు. తాము వెళ్లిన షాపులలో మాత్రం అధికారులు క్షుణ్ణంగా రాత్రి వరకు తనిఖీలు చేస్తూనే ఉన్నారు. బంగారం ఎక్కడి నుంచి కొనుగోలు చేస్తున్నారు. వాటి బిల్లులు, దుకాణాలలో రోజువారీ వ్యాపారం ఎంత? వీరు చూపిస్తున్నది ఎంత? బంగారు నగలు ఇస్తామంటూ చీటీల పేరుతో ప్రజల నుంచి రూ.కోట్లలో నగదు వసూళ్లపై విచారణ చేశారు. అయితే తనఖీలలో ఏ మేరకు అక్రమాలు గుర్తించారు, దుకాణాలపై వచ్చిన ఆరోపణలలో వాస్తవం ఎంత అనే విషయమై ఈ అధికారులు బయటకు వెల్లడించలేదు.

విక్రయాలపై ట్యాక్స్ చెల్లించాల్సిందే

కేవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ కమర్షియల్ ట్యాక్స్

బంగారు విక్రయాలపై షాపు యజమానులు లక్షకు రూ.3 వేలు ట్యాక్స్ చెల్లించాల్సిందే. అలా లేనిపక్షంలో చర్యలు తీసుకుంటాం. అయితే బంగారు 22 క్యారెట్ వుందా లేదా, హాల్‌మార్క్, నాణ్యత తదితర విషయాలు తూనికలు కొలతల అధికారులు చూస్తారు. బంగారంపై చేస్తున్న లావాదేవీలు, కొనుగోళ్లు, అమ్మకాల బిల్లులు, మా కార్యాలయంలో ఉన్న వివరాలకు సరిపోతాయా లేదా అనేది వాణిజ్య పన్నులశాఖ అధికారులుగా మేం విచారిస్తాం.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- 15 ట్రాక్టర్లు స్వాధీనం
- పోలీసుస్టేషన్ ఎదుట డ్రైవర్ల ఆందోళన
- రీచ్ సిబ్బందితో వాగ్వాదం



పోలీసుస్టేషన్ వద్ద ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు


పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

ఒంటిమిట్ట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్జీపల్లి ఇసుకరీచ్ నుంచి పెద్దఎత్తున ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సచివాలయం నుంచి అనుమతి పొందిన వారికి మాత్రం రీచ్‌లోకి వెళ్లి ఇసుక తీసుకోవాలని నిబంధనలు ఉన్నా అందుకు విరుద్ధంగా ఎవరికి తోచిన రీతిలో వారు అక్రమంగా ఇసుకను తరలించుకుపోతున్నారు. రాత్రిపూట ఎక్స్‌కవేటర్ల సాయంతో టిప్పర్ల ద్వారా బయటకు తరలించడం, ఉదయం కూలీలతో ఎలాంటి బిల్లులు లేకుండా ట్రాక్టర్ల ద్వారా తరలించేస్తున్నారు. వీటితో పాటు రీచ్‌కు దగ్గర ఉన్న గ్రామస్థులు మాకు ఇసుకలో పర్సెంటేజీ ఇవ్వాలని మంగళవారం రాత్రి పెద్దఎత్తున రాళ్లను రోడ్డుకు అడ్డం పెట్టి వాహనాలు వెళ్లకుండా ఆందోళన చేపట్టారు.

మా గ్రామం నుంచి తీసుకెళుతున్న ఇసుకకు తమకు మామూళ్లు చెల్లించాలని లేకుంటే ఇసుకను తీసుకెళ్లేందుకు అనుమతి ఇవ్వమని తేల్చి చెప్పారు. ఉదయం కడప నుంచి వెళ్లిన ట్రాక్టర్‌లు రీచ్‌లోకి వెళ్లకుండా అడ్డుపడడంతో స్థానిక ఎస్ఐ శివప్రసాద్ జోక్యం చేసుకుని రోడ్డుకు అడ్డం పెట్టిన కారు, రాళ్ల తొలగించాలని లేకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో వారు వెనక్కు తగ్గారు. ట్రాక్టర్లు వెళ్లిన మరికొద్దిసేపటికే ఇసుక రీచ్ సిబ్బంది ఎక్స్‌కవేటర్లను రోడ్డుకు అడ్డంగా పెట్టి తమకు తెలియకుండా నదిలోకి వెళ్లి ఇసుకను తరలిస్తున్నారని రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయడంతో పోలీసు అధికారులు నదిలో ఉన్న 15 ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి తహసీల్దార్ రమణమ్మకు అప్పజెప్పారు. ఇసుక క్వారీకి చెందిన సిబ్బంది వెంకటేశ్వర్లు తహసీల్దార్‌తో మాట్లాడి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు రావడంతో అక్కడే ఉన్న ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లు ఒక్కసారిగా ఆయనతో ఘర్షణకు దిగారు.

మా ట్రాక్టర్లను కావాలనే పోలీసులకు పట్టించారని, తాము 900 రూపాయలు నగదు ఇచ్చి ఇసుకను తీసుకెళుతున్నామని అప్పుడు లేని ఇబ్బంది ప్రస్తుతం ఎందుకు వచ్చిందని, తమను ఎందుకు పోలీసులకు పట్టించారని ప్రశ్నించారు. అనంతరం పోలిసుస్టేషన్ ఎదుట ట్రాక్టర్ డ్రైవర్లు ఆందోళనకు దిగారు. ఆ సమయంలో స్టేషన్‌లో రైటర్ సుబ్బరాజు ఒక్కరే ఉండడంతో పెద్దఎత్తున అరుపులు, కేకలతో పోలీసుస్టేషన్ హోరెత్తింది. వెంటనే సిబ్బందికి అక్కడికి చేరుకుని ఇరువర్గాల వారిని స్టేషన్ నుంచి పంపించివేశారు.

ఉచిత ఇసుక అంటే తీసుకెళుతున్నాం...



మాకు నిబంధనలు తెలియవు. రోజు మాదిరిగానే వేకువజామున ఇసుకను తరలించేందుకు నదిలోకి వెళ్లాము. ప్రభుత్వం ఇసుక అంటేనే తీసుకెళుతున్నాము. అక్కడ కూలీలతో ఇసుకను నింపుకున్నాము. అనంతరం పోలీసులు వచ్చి ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు. రోజు మా వద్ద డబ్బులు తీసుకుని ఇసుక లోడు చేసేవారు. అలాగే రోజువారీగా తరలించాం. ప్రభుత్వ నిబంధనల బోర్డు ఏర్పాటు చేసి ఎప్పటి నుంచి ఎప్పటివరకు అనే వివరాలను ఏర్పాటు చేయాలి.

- ఆంజనేయులు, ట్రాక్టర్ డ్రైవర్, కడప.

ఉపాధి ద్వారా గోకులాలను పూర్తి చేయాలి

కలికిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు మంజూరైన గోకులాలను (పశువుల షెడ్లు) త్వరగా పూర్తి చేయాలని కలికిరి క్లస్టర్ డ్వామా ఏపీడీ శ్రీనివాసులు ఆదేశించారు. ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వలస వెళ్లిన, లేదా చనిపోయిన కూలీల పేర్లను జాబ్ కార్డుల జాబితా నుంచి తొలగించాలన్నారు. అదే విధంగా కొత్తగా కార్డులు కోరే కూలీలకు వెంటనే జాబ్ కార్డులు జారీ చేయాలన్నారు. వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల నుంచి చదువుకున్న వారిని గుర్తించి వారికి ఉన్నతి కార్యక్రమం ద్వారా పారిశ్రామిక శిక్షణకు పంపాలని ఆదేశించారు. అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో సుజాత, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అవినాశ్ అనుచరులు నా కార్లు తీసుకున్నారు

- అవినాశ్‌రెడ్డి అనుచరులు నా కార్లు తీసుకున్నారు
- ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు
- నాకు న్యాయం చేయండి
- రంగారెడ్డి జిల్లాకు చెందిన బాధితుడి వేడుకోలు
- సోషల్ మీడియాలో వీడియో చక్కర్లు


రంగారెడ్డి జిల్లాకు చెందిన బాధితుడు సతీశ్‌కుమార్

కడప, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నా వాహనాలను కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరులు అద్దెకు అని తీసుకుని.. తిరిగి ఇవ్వకుండా ఇబ్బందుల పాలుచేస్తున్నారని తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకు చెందిన సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు. అందులో తెలిపిన మేరకు..

రంగారెడ్డిలో ట్రావెల్స్ నడుపుతుండేవాడినని సతీష్‌కుమార్ తెలిపారు. ఒక రోజు తెలంగాణ రాష్ట్రం వికారాబాద్‌కు చెందిన మణిరాజ్ వచ్చి నుంచి మూడు వాహనాలు బాడుగు ఇవ్వాలని కోరాడన్నారు. పులివెందుల మెడికల్ కళాశాల వద్ద ఈ వాహనాలను నడిపేందుకు రోజుకు రూ.1500 చొప్పున నెలకు రూ.45,000 బాడుగకు మాట్లాడుకున్నామన్నారు. అప్పటికే మణిరాజ్ అనేకమార్లు తనవద్ద వాహనాలను బాడుగకు తీసుకున్నాడన్నారు. ముందుగా మూడు వాహనాలను తీసుకెళ్లారన్నారు. తర్వాత మరో రెండు వాహనాలు తీసుకెళ్లారన్నారు. ఈ మేరకు రెండు మూడు నెలల పాటు వాహనాలకు సంబంధించిన బాడుగ కూడా చెల్లించారన్నారు. మణిరాజ్ తనవద్దకు వచ్చి కార్లు రిపేరు వచ్చాయని, ప్రస్తుతం బాడుగ కూడా ఇవ్వలేనని, రూ.2లక్షలు డబ్బు కావాలని అడిగారన్నారు. తన వాహనాలు అతనివద్ద ఉన్నాయి కదా అని రూ.2లక్షలు ఇచ్చానన్నారు.

అవినాశ్‌రెడ్డి అనుచరులైన పులివెందులకు చెందిన మహిళా ఎంపీటీసీ, వేంపల్లె జడ్పీటీసీ రవి, ప్రసాదరెడ్డి, శంకర్‌రెడ్డి తన వాహనాలను తీసుకెళ్లారన్నారు. బాడుగకు ఇచ్చిన కార్లు తిరిగిరాకపోవడంతో పాటు తీసుకెళ్లిన వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారన్నారు. దీంతో తాను 2022లో పులివెందుల వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసి తనకు సహాయం కావాలని కోరానన్నారు. దీంతో కార్లు ఎక్కడున్నాయో గుర్తించారన్నారు. కానీ పోలీసులు ఉన్నతాధికారులు లేరని, వారికి చెప్పి ఇస్తామని చెప్పారన్నారు. అయితే పథకం ప్రకారం శంకర్‌రెడ్డి, ప్రసాదరెడ్డి తనకు కాల్ చేసి కార్లు ఇస్తామని రమ్మని చెప్పారన్నారు. తాను అక్కడకు వెళ్లగానే ఇడుపులపాయలోని ఒక భవనంలోకి తీసుకెళ్లి అక్కడ ఇష్టమొచ్చినట్లు కొట్టి, తిట్టి చంపేస్తామని బెదిరించారన్నారు. ప్రసాదరెడ్డి, శంకర్‌రెడ్డిలు వేరేవారికి ఫోన్ చేసి ఇతను చెప్పినా వినడం లేదని, ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నాడని, ఇతనికి ఏదైనా తాపించి బిల్డింగ్ నుంచి తోసేస్తే ఆత్మహత్య కింద పోతుందని వాళ్లు మాట్లాడుకున్నారన్నారు. దీనిని గమనించిన తాను తన మిత్రునికి ఫోన్ చేసి కారు తీసుకురమ్మని చెప్పానన్నారు. తన స్నేహితులు వచ్చిన తర్వాత ఎలాగోలా అక్కడ నుంచి తప్పించుకున్నానన్నారు. ఎంపీటీసీ మహిళ అయినప్పటికి తనను ఇష్టమొచ్చినట్లు దుర్భాషలాడిందన్నారు. పులివెందుల పోలీసులు వైసీపీ నాయకుల చెప్పుచేతల్లోనే పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం మారినా అక్కడ మాత్రం కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన అనుచరులైన శంకర్‌రెడ్డి మాటే చెల్లుతోందన్నారు. 2022లో కేసు పెట్టినప్పుడు పోలీసులు తనకు ఎలాంటి సహకారం అందించలేదన్నారు. తాను ఏమి అడిగినా ఎంపీ అవినాశ్‌రెడ్డి పేరు వినిపించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లను ఒకటే కోరుతున్నా.. నాకు న్యాయం చేయండి అన్నారు. తనకు ఇప్పటికి బెదిరింపు కాల్స్ వస్తున్నాయన్నారు.

సోషల్ మీడియాలో వైరల్

ఈ వీడియో సోషల్ మీడియాలో తిరుగుతోంది. ఇటీవలే మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో కదలిక వచ్చింది. అలాగే సోషల్ మీడియాలో బూతు పోస్టులు పెడుతుండడంతో ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరుడు వర్రా రవీంద్రరెడ్డిని అరెస్టు చేశారు. మరికొందరి కోసం వేట కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ వీడియో చక్కర్లు కొట్టడంతో వైసీపీ నేతలు కలవరపడుతున్నారు. అయితే తెలంగాణలో అద్దెకు తెచ్చిన వాహనాలను పులివెందుల, వేంపల్లెలో తాకట్టుపెట్టారు. అలా పెట్టిన వాహనాలను వేంపల్లెకు చెందిన వైసీపీ నేతలు తక్కువ డబ్బుతో తాకట్టు నుంచి తీసుకున్నారు. ఆ వాహనాలలో తిరిగేవారు. అయితే అసలు ఓనర్లు ఇక్కడకు వచ్చి ఇక్కడున్న వాహనాలను తీసుకెళ్లారు. సతీశ్‌కుమార్ అనే వ్యక్తి ఇంకా మూడు కార్లు ఉన్నాయని, పోలీసులకు చెప్పినట్లు సమాచారం.

ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా గంగిరెడ్డి, పద్మలత


గంగిరెడ్డి, పద్మలత, శివప్రసాద్, విలియంరాజ్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కడప ఎంఈఓ గంగిరెడ్డి, మైదుకూరు ఎంఈఓ పద్మలత ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బుధవారం కడప కలెక్టరేట్ సభా భవనంలో జరిగిన సమావేశానంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్ను కున్నారు. జిల్లా కోశాధికారిగా ఎర్రగుంట్ల ఎంఈఓ ఈఎల్ బీఎస్ శివప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా అట్లూరు ఎంఈఓ విలియంరాజ్‌ను ఎన్నుకున్నారు. వీరితో పాటు కార్యదర్శులు, మిగతా కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు అందరికీ అందాలి

రాజంపేట టౌన్, నవంబరు 20 (ఆంధ్ర జ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు ప్రతి కుటుంబానికి అందాలని జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. బుధవారం బ్యాంకు అనుబంధ శాఖల అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసురక్ష పథకంలో భాగం గా 18 నుంచి 70 ఏళ్ల లోపు ఉన్న ప్రతి వ్యక్తి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమాయోజన పథకాల్లో నమోదు చేసుకో వాలని తెలిపారు. ప్రతి గ్రామ బ్యాంకు, ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ద్వారా అవ గాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ఆ యా పథకాలకు పేర్లు నమోదు చేస్తామన్నారు. కౌలు రైతులు పంట బీమా చేసు కోవాలని జేడీఏ చంద్రానాయక్ కోరారు. ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి నాగా ర్జున మాట్లాడుతూ ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ద్వారా ఔత్సాహి క పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజంపేట, కోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు, నందలూరు మండలాల బ్యాంకు అధికా రులు, ఏపీఎంలు, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి : ఆర్డీ

రాయచోటిటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ లింగ నిర్ధారణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రాయచోటి రెవెన్యూ డివిజన ల్ అధికారి శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయి సలహా, అథారిటీ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయచోటి డివిజన్‌లోని స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు గర్భస్థ లింగ నిర్ధారణ నిషేద చట్టాన్ని పరిగణన లోకి తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితిలో లింగ నిర్ధారణ చేయరాదని, స్కానింగ్ యంత్రాలు ఉపయోగించే వైద్యుల వివరాలు, అథారిటీ వారు జారీ చేసిన సర్టిఫికెట్‌తో సరిపోవాలన్నారు. అనుమతులు లేని స్కానింగ్ సెంటర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. స్కానింగ్ వివరాలను ఫారం-ఎఫ్‌లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇచ్చట లింగ నిర్ధారణ పరీక్షలు చేయం అని స్కాన్ సెంటర్స్‌లో ఐఈసీ ప్రదర్శించాలన్నారు. ప్రతి స్కాన్ సెంటర్ , హాస్పి టల్‌లో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలన్నారు. ముందు కాన్పులలో ఆడపిల్లలు ఉన్న గర్భిణుల పై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. 4వ నెల తరు వాత జరిగిన అబార్షన్ కేసులకు ఆడిట్ చేసి రిపో ర్టు సబ్మిట్ చేయాలన్నారు. అబార్షన్ కోసం వాడే పిల్స్ డాక్టర్ సిఫారసు లేకుండానే అందుబాటులో ఉన్నాయని, దీనిపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లింగ నిర్ధారణ నిషేద చట్టం నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉషశ్రీ, ప్రోగ్రాం ఆఫీసర్ దేవశిరోమణి, చిన్నపిల్లల వైద్యులు నిసార్ అహ్మద్, స్త్రీ వైద్యులు నీలోఫర్ బేగం, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జయరాముడు, ఐసీడీఎస్ వినోద్‌కుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సురేంద్రరెడ్డి, నాగేశ్వర య్య, ఫరీదాబేగం, సీహెచ్‌వో నారాయణ, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు

నందలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకుని భూసారం పెంచుకోవడం తోపాటు మంచి దిగుబడులను పొందవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ తెలిపారు. మండలంలోని లేబాక మంగ మాంబపురం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏడీఏ బి.రమేష్‌బాబు మాట్లాడుతూ సబ్సిడీపై ట్రైకోడెర్మా విరిడీ లభిస్తోందని, కడప కృషి విజ్ఞాన కేంద్రంలో కొత్త రకం నువ్వులు లభిస్తాయని తెలిపారు. ఉద్యాన అధికారి జి.సురేష్‌బాబు మాట్లాడుతూ మామిడిలో సమగ్ర సస్యరక్షణ విధానం వివరించారు. మామిడిలో తేనెమంచు పురుగు నివారణ తదితర చర్యలను వివరించారు. మండల వ్యవసాయాధికారి జి.మల్లికార్జున, జడ్పీఎన్ఎఫ్ సిబ్బంది ద్రవ జీవామృతం, బీజామృతం తయారీ విధానాన్ని వివరించారు.

భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించాలి : జేసీ


చెన్నారెడ్డిపేట వద్ద రైతులతో మాట్లాడుతున్న జేసీ అదితిసింగ్

పోరుమామిళ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అమరావతి-బెంగుళూరు జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని జాయింటు కలెక్టరు అదితిసింగ్ అధికారులను ఆదేశిం చారు. బుధవారం ఆమె పోరుమామిళ్ల మండలంలోని బొప్పాపురం, చెన్నారెడ్డిపేట, పేరమ్మగారిపల్లె, బ్రహ్మంగారిమఠం మండలంలోని ముదుమాల, వెంకటాపురం ప్రాంతాల్లో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను జేసీ దృష్టికి తీసుకెళ్లారు. కొందరు రైతులు ప్రభుత్వం అందించే నష్టపరిహారం తమకు సరిపోదని, మరింత పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూమి కోల్పోయిన అర్హులైన రైతుల వివరాలను సేకరించి నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రమోహన్, పోరుమామిళ్ల తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గండిలో టెండర్లు ఖరారు

చక్రాయపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో వివిధ రకాల వాటికి టెండర్లు, బహిరంగ వేలం నిర్వహించారు. దేవస్థానంలో నిర్వహించే వివాహాలు, ఇతర శుభ కార్యక్రమాలకు పందిళ్లు, ఎలక్ట్రికల్ డెకరేషన్లు, పూల డెకరేషన్లు, సామాన్లు సప్లై చేసుకునేందుకు ఏడాదికి వేంప ల్లెకు చెందిన సురేష్ బాబు రూ.1,01,116కు పాట దక్కించుకున్నారు. దేవస్థానం ఆవరణలో భక్తులు పాదరక్షలు భద్రపరచుకునేందుకు ఇడుపుల పాయకు చెందిన వెంకటా చలపతి రూ.45వేలకు వేలం దక్కించుకున్నారు. స్వామివారి అలంకరణకు గ్రామోత్సవానికి పూలు, పూలమాలలు టెండర్ నిర్వహించగా.. ముగ్గురు పోటీపడి టెండర్లు వేశారు. అనివార్య కారణాలతో టెండర్లను రద్దు చేసి వాయిదా వేశారు. నిత్యాన్నదాన పథకానికి అరటి ఆకులు సప్లై చేసేందుకు, దేవాలయంలో పర్వదినాల్లో మామిడి, అరటి తోరణాలు సరఫరా చేసేందుకు తదితర పాట దక్కించుకున్నారు. కడప దేవదాయ ధర్మాదాయశాఖ జూనియర్ అసిస్టెంట్ విజయభారతి, ఆలయ ఛైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ ఛైర్మన్ కల్లూరు వెంకటస్వామి, దేవస్థాన ప్రధాన అర్చకులు కేసరి, బ్యాంకు అధికారులు, పోలీసులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మంగారి హుండీ ఆదాయం రూ.23లక్షలు

బ్రహ్మంగారిమఠం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం హుండీలను లెక్కించగా రూ.23,04,108 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ సహాయ కమిషనర్ మల్లిఖార్జున ప్రసాద్, దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ తెలిపారు. గత మూడు నెలల కాలంలో భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను పూర్వపు మఠాధిపతి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో లెక్కించగా రూ.23,04,108 నగదు, 8 గ్రాముల బంగారు, 280 గ్రాములు వెండి వచ్చినట్లు తెలిపారు.

నిబంధనలు పాటించని మద్యం దుకాణాల లైసెన్సు రద్దు

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్


లిక్కర్ గొడౌన్‌లో స్టాకును పరిశీలిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

ప్రొద్దుటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని మద్యం దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని.. బెల్టు షాపులను ఉపేక్షించమని ఉమ్మడి కడప జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ హెచ్చరించారు. బుధవారం ఆయన ప్రొద్దుటూరు విచ్చేశారు. లింగాపురం వద్ద వున్న లిక్కర్‌డిపోను పరిశీలించి సరుకుల నిల్వలపై ఆరా తీశారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయాన్ని విజిట్ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మద్యం షాపుల్లో అక్కడే తాగడానికి అనుమతి లేదని.. అలా తాపే మద్యం దుకాణాలపై చర్యలు తప్పవన్నారు. బెల్టు షాపులపై నిరంతర నిఘా పెట్టామన్నారు. ఇప్పటికే జిల్లాలో అనేక ప్రాంతాల్లో కేసులు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా కొందరు మద్యం దుకాణాల నిర్వాహకులు డిపో మేజేజర్‌పై ఫిర్యాదు చేశారు. డిపో మేనేజర్ కొందరికి ఎక్కువ సరుకును ఇస్తూ మరికొందరికి తక్కువ సరుకు ఇస్తున్నాడని ఆరోపించారు. దీనిపై డిప్యూటి కమిషనర్ స్పందిస్తూ మద్యం తక్కువ ఎక్కువ ఇవ్వరాదని.. అందరికి సమానంగా మద్యం సరఫరా చేస్తారని తెలిపారు.

అక్రమ మద్యం, నాటుసారా తయారీ, అమ్మకంపై నిరంతర దాడులు


కల్లూరుపల్లెలో కార్డన్ సెర్చ్ చేస్తున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు

పులివెందుల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమ మద్యం, నాటుసారా తయారీ, అమ్మకంపై నిరంతర దాడులు కొనసాగిస్తామని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి (డీపీఈఓ) ఎస్.రవికుమార్ అన్నారు. బుధవారం పులివెందుల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చక్రాయపేట మండలం కల్లూరుపల్లె తండాలో ఎక్సైజ్ అధికారులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పాత నేరస్తులు, అనుమానితులు, గ్రామస్తుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. నాటుసారాతో కలిగే దుష్ప్రభావాలు, పౌరుల భవిష్యత్తుపై ఎలా ప్రభావం చూపుతుందో వివరించారు. నేరస్తులు, అనుమానితులను బైండోవర్ చేసి నాటుసారా నిర్మూలిస్తామని తెలిపారు. పులివెందుల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చెన్నారెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, చక్రాయపేట ఎస్ఐ కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధికారులు, అనుబంధ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని గ్రీవెన్స్‌హాల్లో బుధవారం వైద్యులతో కలెక్టర్ సమీక్షిస్తూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని... ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేయాలన్నారు. జిల్లాలోని 51 ప్రాథమిక ఆసుపత్రుల్లో వైద్యాధికారులు రాబోయే మూడు నెలలకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. వచ్చే సమావేశంలో పీపీటీ ప్రజెంటేషన్ ఇవ్వాలన్నారు. ప్రైమరీ హెల్త్ సెంటర్ ప్రస్తుత స్టేటస్, ఓపీ, ఐపీ, డెలివరీ, ఇమ్యూనైజేషన్ వంటి రోజు వారి డేటాను పొందుపరచాలన్నారు. వైద్యాధికారులు లక్ష్యాలను సాధించేందుకు కష్టపడి పని చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అన్ని ప్రాథమిక, అర్బన్ హెల్త్ సెంటర్లలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించిందని.. అధికారులు నిబద్ధతతో పనిచే యాలన్నారు. వైద్యాధికారులు పనిచేసే ప్రాంతాల్లో నివాసాలు ఉండాలని ఆదేశించారు. మాతాశిశు మరణాల సంఖ్యను తగ్గించ డం, 104 వాహనాల షెడ్యూల్, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు, తదితర ఆరోగ్య సేవలపై అధికారులకు సూచనలు జారీ చేశారు. ఐపీ, ఓపీ, ల్యాబ్, డెలివరీ వంటి ఆరోగ్య సేవల్లో రాష్ట్ర స్థాయిలో 'ఏ' గ్రేడ్ ర్యాంకింగ్‌లో జిల్లా రెండో స్థానంలో నిలిచిందన్నారు. ప్రతిభ చూపుతున్న వైద్యాధికారులను కలెక్టర్ అభినందించారు. డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ నాగరాజు, డీఐఓ హిమదేవి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ బాలాంజనేయులు, వైద్యాధికా రులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ నిర్వహణపై కలెక్టర్ సమీక్ష

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించడం, ప్రజలకు అర్జీల అవసరం రాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక, కంట్రోల్ రూమ్ అనుబంధ అధికారులతో సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, జడ్పీ సీఈఓ ఓబులమ్మ, కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, కేఎంసీ కమిషనరు మనోజ్‌రెడ్డి, కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జి సురేష్ కుమార్, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

గొంతుకోసుకుని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం



కమలాపురం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని బాలికల గురుకుల పాఠశాలలో జూనియర్ ఇంటర్ విద్యార్థిని కౌసల్య తరగతి గదిలో గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన ఉపాధ్యాయులు వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రిన్సిపాల్ తులశమ్మ సమాచారం మేరకు.. బుధవారం మధ్యాహ్నం తోటి విద్యార్థినులతో కలిసి భోజనం చేసేందుకు కౌసల్య డైనింగ్ హాలుకు వెళ్లింది. భోజనం చేయకుండానే వెనుదిరిగి తరగతి గదికి వెళ్లి చిన్న అద్దాన్ని పగల గొట్టుకుని ఆముక్కతో గొంతు కోసుకుని స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే ఉపాధ్యాయులు గమనిండంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని తెలిపారు. విద్యార్థినిది రాజంపేట అని ఆమె తలిదండ్రులు కువైట్‌లో ఉన్నారన్నారు. విద్యార్థినికి చదువు మీద ఆసక్తి లేదని.. ఇటీవల ఆమె నానమ్మ పాఠశాలలో వదిలి వెళ్లడంతో ఇలా చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నామన్నారు. ఈ విషయంపై విద్యార్థిని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. ఎలాంటి ప్రాణహాని లేదని వైద్యులు తెలిపారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కాగా, విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

ఘర్షణలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

- ఇద్దరు నిందితుల అరెస్ట్

బద్వేలుటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఘర్షణలో గాయపడ్డ మృతికి కారణమైన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ రాజగోపాల్ తెలిపారు. నెల్లూరు జిల్లా మర్రి పాడు మండలం చాబోలు గ్రామానికి చెందిన మంచాల వెంకటయ్య(38)పై గొడుగునూరు క్రిష్ణ, చెప్పలి దినేష్ అనే ఇరు వురు రెండు నెలలక్రితం దాడి చేయడంతో చికిత్స పొందు తూ మృతి చెందాడు. ఈ క్రమంలో నిందితులను బుధవారం బద్వేలు ఆర్టీసీ బస్టాండు వద్ద అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు. మృతుడు వెంకటయ్య చెల్లెలు, భర్త గొడుగునూరు క్రిష్ణలు కుటుంబకలహాలతో విడిపో యారు. ఈ క్రమంలో రెండవ నిందితుడు అయిన చెప్పలి దినేష్ తన అమ్మతో వెంకటయ్య చనువుగా ఉన్నాడనే అనుమానంతో సహించలేకపోయాడు. ఈనేపథ్యంలో పథకం ప్రకారం గొడుగునూరు క్రిష్ణ, చెప్పలి దినేష్‌లు ఆగస్టు 13వ తేదీ అబుసాయిపేట గ్రామంలో కత్తితో దాడి చేయడంతో వెంకటయ్యకు గాయాల య్యాయి. వెంకటయ్యను వెంటనే కడప, నెల్లూరు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. అతని చనిపోవడానికి కారణమైన గొడుగునూరు క్రిష్ణ, చెప్పలి దినేష్‌లను బుధవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

వైసీపీ నేతపై చీటింగ్ కేసు నమోదు

కడప క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ప్రైవేటు కాలేజీ విక్రయానికి సంబంధించి రూ.30లక్షలు తీసు కుని మోసం చేసిన వైసీపీ నేతపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. వైసీపీ నేత సుభాన్‌బాషా కడపకు చెందిన డాక్టర్ నజీము ద్దీన్‌కు వికాస్ కళాశాలను విక్రయిస్తున్నట్లు అగ్రిమెంటు రాసి చ్చాడు. ఆసమయంలో నజీముద్దీన్ నుంచి రూ.30లక్షలు తీసుకున్నాడు. ఆ తర్వాత కళాశాలకు యూనివర్శిటీ అను మతి లేదని తెలిసి.. నజీముద్దీన్ తమ డబ్బులు వెనక్కు ఇవ్వాలని కోరాడు. అయితే సుభాన్‌బాషా డబ్బులు ఇవ్వక పోవగా.. బెదిరించడంతో నజీముద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు సుభాన్‌బాషాపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



బ్రహ్మంగారిమఠం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాణిబావి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. బి.కోడూరు మండలం తుమ్మలపల్లెకు చెందిన ఎ.నారాయణ, తన బంధువు పరమేశ్వర రోజువారి పనుల నిమిత్తం మైదుకూరు పట్ట ణానికి వెళ్లారు. పనులు ముగించుకుని ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వస్తుండగా రాణిబావి సమీపంలోని టోల్‌గేటు దగ్గర ఎదు రుగా వస్తున్న లారీని అదుపు తప్పి ఢీకొన్నారు. దీంతో నారాయణ (52) అక్కడికక్కడే మృతి చెందాడు. పరమేశ్వర్‌కు తీవ్రగా యాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం కడపలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి బ్రహ్మ ంగారిమఠం ఎస్ఐ చంద్రశేఖర్ చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

● డీఎల్‌పీవో అమర్‌నాథ్


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

కురబలకోట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎల్‌పీవో అమర్‌నాథ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కురబలకోట సచివాలయం, ఆధార్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతిఒక్కరూ బ్యాంక్ అకౌంట్‌కు ఎన్‌సీఎల్ యాప్‌లో ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో 100 శాతం హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగయ్య, ఎంఈవో ద్వారకనాథ్, ఈవోపీఆర్‌డీ శేషగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు చేపట్టండి

● జలవనరులశాఖ మంత్రికి టీడీపీ నేతల వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ సీనియర్ నేతలు

మదనపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినికొండ పంచాయతీ రామాచార్లపల్లె చెరువు సప్లయ్ చానల్‌ను పునరుద్ధరించాలని గంగన్నగారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నేత గంగారపు బాబురెడ్డి, జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. బుధవారం విజయవాడలోని మంత్రి నివాసంలో బాబురెడ్డి కలిశారు. పట్టణం గుండా ప్రవహిస్తున్న బాహుదానది నుంచి రామాచార్లపల్లె చెరువునకు సప్లయ్‌చానల్ ఉందని, అది ప్రస్తుతం పూడిపోయి పిచ్చిమొక్కలతో నిండి రూపురేఖలు కోల్పోయిందని వివరించారు. వర్షాల నేపథ్యంలో పూడిక తీత పనులు చేపట్టాలని ఇదివరకే స్థానిక ఆయకట్టు రైతులతో కలసి ఇరిగేషన్ ఈఈ, డీఈలను కలసి విన్నవించినా ప్రయోజనం లేదన్నారు. ఇంకా పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. వీరి వెంట టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మధుబాబు, దేవుడు రమేష్, కంచర్ల రంగస్వామినాయుడు ఉన్నారు.

ప్రమాదాలకు గురికావద్దు : ఎంవీఐ


మాట్లాడుతున్న ఎంవీఐ శివలింగయ్య

మదనపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అతివేగంగా ద్విచక్రవాహనాలు నడిపి ప్రమాదాలకు గురై కుటుంబీకులకు మనోవేదన కల్గించవద్దని మదనపల్లె మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శివలింగయ్య, దినేష్‌చంద్ర, శ్రీహరిలు సూచించారు. స్థానిక ఆదిత్య కళాశాలలో బుధవారం ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్రవాహనం నడిపేటప్పుడు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. అతివేగంగా ద్విచక్రవాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. వాహనదారులకు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్సూతో పాటు అన్ని పత్రాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి


తెగుళ్లను పరిశీలిస్తున్న సోమశేఖర్

గుర్రంకొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ వ్యవసాయంపై పట్టు సాధించేలా వ్యవసాయశాఖ అధికారులు కృషి చేయాలని జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకుడు అశోక్‌కుమార్, కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సోమశేఖర్ అన్నారు. మండలంలోని రామాపురం, సరిమడుగు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అలాగే సేంద్రియ ఎరువుల వలన కలిగే ప్రయోజనాలను తెలియజేయాలన్నారు. అనంతరం మామిడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏవో రత్నమ్మ, గంగాధర్, యోగిత, రజిత, ధనలక్ష్మీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్‌సీసీ సర్టిఫికెట్స్ పంపిణీ


ఎన్‌సీసీ సర్టిఫికెట్స్ అందిస్తున్న కరస్పాండెంట్

మదనపల్లెఅర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆరోగ్యమాత 22 విద్యార్థులకు 5వ ఆంధ్రాగర్ల్స్ బెటాలియన్ స్టాఫ్ ఎన్‌సీసీ సర్టిఫికెట్స్ అందజేశారు. ఇందులో కైలాస్‌కుమార్, వెంకటేష్, వనితా, ఏఎన్‌వో ఇస్మాయిల్, పునితా, కరస్పాండెంట్‌లు కలిసి విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

పట్టణంలో ఆక్రమణల తొలగింపు

● భారీ ఎత్తున పోలీసు బలగాల మోహరింపు

● కమిషనర్ పల్లవికి ప్రశంసలు


బి.కొత్తకోట జ్యోతి చౌక్‌లో ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

బి.కొత్తకోట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల తరబడి బి.కొత్తకోట పట్టణ ప్రజలు ఎదురుచూసిన కల నెరవేరబోతోంది. బుధవారం ఆక్రమణలు తొలగింపు పనులు ప్రారంభించడంతో లైన్ క్లియర్ అయింది. పట్టణంలోని ప్రధాన కూడలి అయిన జ్యోతిచౌక్‌లో బస్‌షెల్టర్, వాటర్‌ట్యాంక్ సహా ఆక్రమణకు గురికాగా, పట్టణంలోని పీటీఎం రోడ్డులో కొయ్యల మండీలు, రంగసముద్రం రోడ్డు, బెంగళూరు రోడ్డులలో దుకాణదారులు వారి ఇష్టం వచ్చినట్టు రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. పీటీఎం రోడ్డులోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట, జ్యోతి బస్టాండులో రోడ్డు పక్కన, బాలికల ఉన్నతపాఠశాల పక్కన స్థలాలు ఆక్రమించి బంకులు, పూలఅంగళ్లు ఏర్పాటు చేసుకున్నారు. ప్రధాన రోడ్లు ఇరువైపులా ఆక్రమణకు గురికావడంతో రోడ్లు కుంచించుకుపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగేది. దుకాణాల ముందు డ్రైనేజి లేకుండా మూతలు వేసేయడంతో వర్షం వచ్చినప్పుడు నీరు డ్రైనేజిల ద్వారా కాకుండా రోడ్డుపై ప్రవహించేది. ఈ సమస్యలపై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులలో స్పందన కరువైంది. ఎట్టకేలకు ఈ సమస్యపై ప్రస్తుత నగర పంచాయతీ కమిషనర్ జీఆర్ పల్లవి స్పందించారు. వారం రోజుల క్రితం పట్టణంలో కలియ తిరిగి ఆక్రమణదారులను స్వచ్ఛందంగా తొలగించాలంటూ అల్టిమేటం ఇచ్చారు. అయినా ఆక్రమణదారులు ఆ హెచ్చరికలను లైట్ తీసుకున్నారు. దీంతో బుధవారం పట్టణ సీఐ రాజారెడ్డి, పీటీఎం ఎస్ఐ నరసింహుడు, ఏఎస్ఐ బొజ్జె నాయక్ సిబ్బందితో పాటు సీఆర్‌పీఎఫ్ బలగాల సాయంతో కమిషనర్ రంగంలోకి దిగారు. ఎక్స్‌కవేటర్లను రప్పించి తొలుత జ్యోతి సర్కిల్‌లో ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ఏళ్ల తరబడి పాతుకుపోయిన కబ్జారాయుళ్లను ఖాళీ చేయించారు. అనంతరం పీటీఎం రోడ్డులోని దుకాణాలు, కొయ్యలమండీల ఎదుట ప్రభుత్వ డ్రైనేజి వరకు అంగుళం కూడా వదలకుండా తొలగించారు. ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆక్రమించి ఏర్పాటు చేసిన బంకులన్నింటినీ తొలగించారు. ఈ తొలగింపు ఆపాలంటూ ఎన్ని విధాలుగా వత్తిళ్లు వచ్చినా కమిషనర్ పల్లవి, ఏవో రమాదేవిలు వెనక్కు తగ్గలేదు. సాయంత్రం వరకూ పీటీయం రోడ్డులో ఆక్రమణలు తొలగించారు. గురువారం మిగతా రోడ్లలో ఆక్రమణలు తొలగించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

పుస్తకాలే పిల్లలకు నేస్తాలు

మదనపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పుస్తకాలే పిల్లలకు నేస్తాలని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మునిగోపాలకృష్ణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను విద్యార్థి దశలో రూ.5లు గ్రంథాలయ సభ్యత్వం చెల్లించి పుస్తకాలు చదవడం అలవాటుగా చేసుకున్నట్లు తెలిపారు. పిల్లలకు నేస్తాలుగా ఉంటున్న పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ అధికారిణి వసంత పిలుపునిచ్చారు. అనంతరం వక్తలు, రచయితలు టి.ఎస్.కృష్ణమూర్తి, జనార్ధన్, నాగరాజ, తిరుపతిరావు, పూర్ణిమ, రెడ్డెప్ప, లింగాల యుగంధరాచారి, ధర్మాధిపతి నాగభూషణం, సరస్వతి, చిరంజీవి, తదితరులు వారోత్సవాల గురించి పిల్లలకు వివరించారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబరచిన పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొడవతి ప్రభాకర, రామచంద్ర, రమణమ్మ, జ్యుడీషియల్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ గెజిటెడ్ అధికారిణి ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న యూనియన్ నాయకులు

మదనపల్లెఅర్బన్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతిచెందిన ఓ ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆటో యూనియన్ నేతలు బుధవారం ఆర్థికసాయం చేశారు. మదనపల్లెకు చెందిన ఆటో డ్రైవర్ మామిళ్ల రవికుమార్(34) గత కొంతకాలంగా మదనపల్లె, బెంగుళూరు, తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ ఉండేవాడు. కాగా మంగళవారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇతనికి భార్య సుజాత, కుమారుడు ఆదిత్య(11), కుమార్తె(9) ఉన్నారు. ఈ నేపథ్యంలో కుటుంబానికి తమవంతు సాయంగా మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లె, చౌడేశ్వరీ సర్కిల్‌లోని ఆటో యూనియన్ నాయకులు రూ.10.516ను గౌరవాధ్యక్షుడు పురం సహదేవ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న ఫోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ

పెద్దమండ్యం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలని తంబళ్లపల్లి ఫోర్డు స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లలితమ్మ పిలుపునిచ్చారు. బాలల హక్కుల దినోత్సవం పురస్కరించుకొని ఫోర్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు నిర్మూలించాలని, విద్యావంతులు తమవంతుగా బాలల హక్కులపై వారికి అవగాహన కల్పించాలన్నారు. ఎంఈవో మాట్లాడుతూ పిల్లల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు రూ.8 వేల విలువ చేసే బహుమతులను విద్యార్థులకు అందజేశారు. ఎంఈవో మనోహర్, కాలేజీ ప్రిన్సిపాల్ అమరేంద్రకుమార్, అధ్యాపకులు, ఫోర్డు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లెటౌన్: రాజ్యాంగం బాలలకు కల్పించిన హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరికీ వుందని పోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జడ్పీహైస్కూల్లో బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో వారం రోజుల పాటు బాలల హక్కుల పరిరక్షణపై ర్యాలీలు, సదస్సులు, సమావేశాలు నిర్వహించామన్నారు. ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన బాల, బాలికలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోర్డు సిబ్బంది, జడ్పీహైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాన్షీరామ్ విగ్రహం ఏర్పాటుకు వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆ పార్టీ నేతలు కోరారు. ఈ మేరకు బుధవారం మదనపల్లె మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పట్టణంలో కాన్షీరామ్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రమణ, బాలాజీ, శ్రీనాథ్, గంగాధర్, శివ, గూడుపల్లె శివ, సంధ్య, అనిల్, మహేష్, రెడ్డప్ప, నల్లప్ప పాల్గొన్నారు.

'చలో విజయవాడ'ను విజయవంతం చేయండి

పీలేరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ చేపట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్ ఈఏ జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ సీపీఎస్ ఉద్యోగులను కోరారు. 'చలో విజయవాడ' ప్రచారపత్రాలను బుధవారం ఆయన కేవీపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల హక్కు అయిన పాత పెన్షన్ విధానం అమలు కోసం డిసెంబరు 10న విజయవాడలో మహాసభ ఏర్పాటు చేసినట్లు వివరించారు. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులకు ఆర్థిక, సామాజిక భద్రత లేకుండా పోయిందని వాపోయారు. ఈ విధానాన్ని రద్దు చేస్తామని కూటమి నేతలు ఎన్నికల మ్యానిఫెస్టోలో సైతం పొందుపరిచారని, వారి వాగ్ధానాన్ని గుర్తు చేసి సాధించుకునేందుకు మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని సీపీఎస్ ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వైవీ రమణ, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, నందకుమార్, హరినాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెటౌన్: రాష్ట్రంలో సీపీఎస్ ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక జడ్పీహైస్కూల్లో సీపీఎస్ ఉద్యోగుల ఛలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు రంజిత్, శ్రీధర్, రాజేంద్రకుమార్, గోపినాథ్, నాగశ్రీనివాస్, హసీనా తదితరులు పాల్గొన్నారు.

కడప పెద్దదర్గాకు చాదర్ సమర్పణ


దర్గా ప్రతినిధులకు చాదర్ అందజేస్తున్న దృశ్యం

వాల్మీకిపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గత నాలుగురోజులుగా కడప అమీన్ పీర్ దర్గాలో నిర్వహిస్తున్న ఉరుసు మహోత్సవాలకు బుధవారం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి తరపున చాదర్‌ను అందజేశారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో టీడీపీ నాయకుల సమక్షంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి చేతుల మీదుగా చాదర్‌ను దర్గా ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు పులి నరేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు చంద్రమౌళి, పీవీ నారాయణ, రాజేంద్రాచారి, రమేష్, పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం


రక్తదానం చేసిన వారికి పండ్లు, జ్యూస్ అందిస్తున్న దృశ్యం

కురబలకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రిన్సిపల్ సి.యువరాజ్, డీన్ తులసీరామ్‌నాయుడు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద సమయాల్లో రక్తం అందక ఎంతో మంది మరణిస్తున్నారని, అలాంటి వారికి రక్తదాన శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా 160 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రవి, మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం పెంచుకోవాలి

గుర్రంకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈవో సురేంద్రబాబు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అహమ్మద్‌బాష, గ్రంథాలయాధికారిణి రెడ్డికుమారి పాల్గొన్నారు.

కలకడ: ప్రతి విద్యార్థి మంచి భవిష్యత్ కోసం విద్యతో పాటు విజ్ఞానం పెంపొందించుకోవాలని బాటవారిపల్లె హైస్కూల్ హెచ్‌ఎం సరస్వతమ్మ సూచించారు. బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అమరనాథ్‌లు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం తనిఖీ

బి.కొత్తకోట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడికాయలపల్లి సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని తహశీల్దార్ మహమ్మద్‌అన్సారీ బుధవారం తనిఖీ చేశారు. పిల్లలకు ఇబ్బంది పెట్టకుండా సకాలంలో ఆధార్ సవరణ చేసి పంపాలన్నారు. తగిన రుసుం మాత్రమే వసూలు చేయాలని, అధికంగా వసూలు చేస్తే చర్యలుంటామని హెచ్చరించారు.

రేపు డయల్ యువర్ డీఎం

మదనపల్లెఅర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మదనపల్లె వన్ అండ్ టూ డిపోల్లో ఈ నెల 22న ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ప్రయాణికులు డిపోల పరిధిలోని సర్వీసుల్లో ఏమైనా సమస్యలున్నా, ఆర్టీసీకి ఆదాయాన్ని పెంచడానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. వివరాలకు 9959225676 నెంబరుకు తెలియజేయాలన్నారు.

23 నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు

మదనపల్లెఅర్బన్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్కూల్ గేమ్స్ అండర్-17 బాలికల నెట్‌బాల్ పోటీలు ఈ నెల 23 నుంచి 25 వరకు సీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంత తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల బాలికలు పాల్గొనున్నారు. ఇందులో రాష్ట్ర జట్టును ఎంపిక చేసి జాతీయ నెట్‌బాల్ పోటీలకు పంపనున్నామని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ ఛైర్మన్, హెచ్‌ఎం ఆంజనేయులు తెలిపారు.

దాతలు సహకరించండి

నిమ్మనపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని తవళం అటవీ ప్రాంతంలో వెలసిన యోగనేలమల్లేశ్వర ఆలయ అన్నదాన ట్రస్టుకు దాతలు విరాళాలు ఇచ్చి సహకరించాలని ట్రస్టు ఛైర్మన్ రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అలయం వద్ద భక్తుల కొరకు గత కొన్నేళ్లుగా ఉచిత అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని, దాతలు విరాళాలు ఇవ్వాలని కోరారు. వివరాలకు 9989167212 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు

ములకలచెరువు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ గాయత్రి హెచ్చరించారు. స్థానిక షాదీమహల్, బస్టాండు సర్కిల్, ఆర్టీసీ బస్టాండుల్లో బుధవారం ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం రికార్డులు సక్రమంగా లేని వాహనాలకు జరిమానా విధించారు.

ఆధార్ లింక్ చేసుకోవాలి

పెద్దమండ్యం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో గురువారం కేంద్ర పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింక్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీధర్‌రావు వెల్లడించారు. ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రత్యేక సేవ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

నిమ్మనపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కొండయ్యవారిపల్లి పంచాయతీ వెంకోజిగారిపల్లి అంబేద్కర్ కాలనీలో కాలువలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి మిథున్ చక్రవర్తి, కార్యదర్శి రాజేష్, సిబ్బంది గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

షర్మిలను కలిసిన రెడ్డిసాహెబ్



మదనపల్లె అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలనం బుధవారం కాంగ్రెస్ పార్టీ మదనపల్లె నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్ మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆధార్‌కార్డులు మంజూరు

మదనపల్లెటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలోని అంగన్‌వాడీ చిన్నారులకు కొత్తగా ఆధార్‌కార్డులు మంజూరు చేసే ప్రక్రియ ప్రారంభమైందని ఎంపీడీవో తాజ్‌మస్రూర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బసినికొండ, అంకిశెట్టిపల్లె గ్రామ పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక ఆధార్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మదనపల్లె అర్బన్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): కుక్క అడ్డురావడంతో కిందపడి ముగ్గురికి గాయాలైన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. బుధవారం పట్టణంలోని బెంగళూరు రోడ్డు, బీటీ కళాశాల వద్ద రోడ్డుపై కుక్క అడ్డు రావడంతో బైక్‌లో నుంచి కిందపడి హర్ష, చరణ్, చతువర్ధన్‌లు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

దర్జాగా మున్సిపల్ స్థలం ఆక్రమణ

● అధికార పార్టీ నాయకుల అండతో హోంగార్డు నిర్వాకం


మున్సిపల్ పాఠశాల స్థలంలోనే ఆక్రమించి నిర్మించిన పునాదులు

మదనపల్లె టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం మున్సిపల్ 35వ వార్డులో ఓ హోంగార్డు దర్జాగా మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించుకుని ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. పట్టణంలోని 35వ వార్డు కోళ్లబైలు కాలనికి వెళ్లే మార్గంలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వుంది. సర్వేనెంబరు 15లోని ఈ పాఠశాల పక్కనే ఓ హోమ్‌గార్డు తను కొనుగోలు చేసిన స్థలంలో ఇంటి నిర్మాణం మొదలుపెట్టాడు. అంతే కాకుండా పక్కనే వున్న మున్సిపల్ స్థలాన్ని కూడా 15 అడుగుల మేర ఆక్రమించి పునాదులు వేశాడు. ఈ విషయమై స్థానికులు రెవిన్యూ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా అధికారులు వచ్చి సర్వే చేసి అక్కడ 15 అడుగుల ప్రభుత్వ స్థలంలో పునాదులు నిర్మించాలని మార్కింగ్ వేశారు. అక్రమ పునాదులు తొలగించాలని హెచ్చరించారు. కాగా కొందరు అధికార పార్టీ నాయకులు కలుగజేసుకుని హోంగార్డుకు వత్తాసు పలకడంతో, పునాదులు తొలగించడం అటుంచి, ఈ పునాదులపై పిల్లర్ల నిర్మాణం కూడా ప్రారంభించారు. దీనిపై అధికార పార్టీకి చెందిన మరో వర్గం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దృష్టికి తీసుకెళతామన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ప్రమీలను వివరణ కోరగా ఆమె స్పందిస్తూ.. ఈ విషయంపై మున్సిపల్, రెవెన్యూ అధికారులను పంపించి ఆక్రమణలు చేసినట్లు తేలితే చర్యలు తీసుకుంటామన్నారు.

దారి ఆక్రమణపై లబ్ధిదారుల ఆందోళన


ఆందోళన చేస్తున్న జగనన్న కాలనీ లబ్ధిదారులు

పీలేరు,నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆక్రమణకు గురైన తమ కాలనీ దారిని పునరుద్ధరించాలని కోరుతూ జగనన్న కాలనీ లబ్ధిదారులు బుధవారం ఆందోళన చేపట్టారు. పీలేరు పట్టణంలోని ఇళ్లు లేని వారి కోసం ప్రభుత్వం గతంలో ఏపీఐఐసీ లే-ఔట్-1 పేరిట ముడుపులవేముల పంచాయతీలో జగనన్న కాలనీ ఏర్పాటు చేసింది. స్థానిక ఎం.ఎం.ఫంక్షన్ హాలు వెనుక నుంచి కాలనీకి 30 అడుగుల రోడ్డు అధికారులు ఏర్పాటు చేశారు. అయితే దారి ఏర్పాటు చేసిన భూమికి తమ పట్టాలు ఉన్నాయంటూ కొంతమంది నాలుగు నెలల క్రితం కంచె ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయాన్ని అప్పట్లో లబ్ధిదారులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఫిర్యాదుతో స్పందించిన రెవెన్యూ అధికారులు తమ క్షేత్రస్థాయిలో విచారించి దారి సమస్యను పరిష్కరిస్తామన్నారు. నాలుగు నెలలు గడిచినా అధికారులు పట్టించుకోకపోవడంతో బుధవారం పలువురు లబ్ధిదారులు ఆ దారి వద్ద ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని వారికి నచ్చజెపి సర్దిచెప్పి పంపారు. దీంతో లబ్ధిదారులు వెనక్కు తగ్గారు. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారో లేదో వేచి చూడాలి.